


# విజయభాను





విశాఖపట్నం, మంగళవారం 13-02-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 151 పేజీలు : 8 వెల : 1 రూపాయి


మస్కట్‌లో

## నరేంద్ర మోదీ



మస్కట్: ప్రధాని మోదీ తన నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మస్కట్ లోని మత్రాహ్ ఏరియాలో ఉన్న 125 ఏళ్ల పురాతన తరువాయి 2లో

స్వాతంత్ర్య పోరాటం గతచరిత్ర

# హక్కుల పోరాటమే నేటి చరిత్ర



- పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు
- 116 రోజులపాటు నీరు-ప్రగతి
- జిల్లా కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్
- జలసంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలి
- సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర అయితే.. రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నీరు-ప్రగతి, వ్యవసాయంపై ఆయన జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్నివిధాలా సహకరించామన్నారు.

జీఎస్టీ, నోట్లరద్దు వంటి పరిణామాలు తలెత్తినప్పుడు కేంద్రానికి అండగా నిలిచిన విషయాలను సీఎం గుర్తు చేశారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీకి కేంద్రం మరింత సహకారం అందించాలని పేర్కొన్నారు.

పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చేవరకూ చేయూతనివ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని అన్నారు.

ప్రతిపక్షం లేఖల ద్వారా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోందని దుయ్యబట్టారు. తెలిసిచేసినా తెలియక చేసినా రాష్ట్రప్రయోజనాలకు విరుద్ధంగా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్ట అని మండిపడ్డారు.



*116 రోజులపాటు నీరు-ప్రగతి*

116 రోజులపాటు నీరు-ప్రగతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ప్రాధాన్యత ప్రాజెక్టుల పనులపై ఆయన మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో తరువాయి 2లో



బడ్జెట్ కేటాయింపులపై

## చర్చలు జరుగుతున్నాయి

- మార్చి నెలాఖరుకు కొలిక్కి రావచ్చు
- ప్రతిపక్ష ఆరోపణలు నిరాధారం
- కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు

విజయనగరం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై స్పందించేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు నిరాకరించారు. విజయనగరంలో నూతనంగా నిర్మించిన ఏసీబీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి మంత్రి హాజరయ్యారు. ఈ తరువాయి 2లో

## హక్కులను కాపాడుకుందాం



- రాజకీయ పరిణామాలపై ఉండవల్లితో జేపీ భేటీ

హైదరాబాద్: లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణతో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం భేటీ అయ్యారు. బేగంపేటలోని లోక్‌సత్తా కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తాజా రాజకీయ పరిణామాలు, నిజనిర్ధారణ కమిటీ విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ.. మన హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇప్పటివరకు ప్రచారాలు, ఆర్భాటాలు తప్ప రాష్ట్రానికి వచ్చిందేమీ లేదని విమర్శించారు. విభజన హామీల సాధనకు చిత్తశుద్ధితో తమ వంతు ప్రయత్నం చేస్తామని జేపీ అన్నారు. విభజన హామీలు, తరువాయి 2లో

## శరవేగంగా సీఐఐ సదస్సుకు ఏర్పాట్లు

24, 25, 26 తేదీల్లో భారీ సదస్సుకు సన్నాహాలు

ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు

రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం: ఈ నెల 24, 25, 26 తేదీలలో విశాఖలో జరగనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అతిధి గృహంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, తరువాయి 2లో



## ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు

- ప్రజా ప్రయోజనాల కోసం పోరాడండి
- నినదిస్తూ వైకాపా ర్యాలీ

గుంటూరు: విభజన హామీల అమలు, ప్రత్యేక హోదా కోరుతూ గుంటూరులో వైకాపా ర్యాలీ నిర్వహించింది. వైకాపా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ముస్తాఫా పాల్గొన్నారు. ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు అని నినదిస్తూ లాడ్జి సెంటర్ నుంచి శంకర్ విలాస్ కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, వైకాపా కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు. తెదేపా కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే విభజన హామీలు, ప్రత్యేక హదా అంశాలపై ఇప్పటివరకు నిలదీయకుండా నాలుగు సంవత్సరాలుగా కాలయాపన చేసిందని ఎమ్మెల్యే ముస్తాఫా ధ్వజమెత్తారు.

ఇప్పటికైనా ఎంపీలందరూ రాజీనామా చేసి పోరాడాలని.. అప్పుడే సాధించగలుగుతామని సూచించారు. ప్రజా ప్రయోజనాల కోసం అందరూ ఏకమై పోరాడదామని పిలుపునిచ్చారు.

## హవాలా రాకెట్ గుట్టురట్టు



హైదరాబాద్: గుట్టుచప్పుడు కాకుండా హవాలా లావాదేవీలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఉత్తర మండల టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తోన్న కోటి 40 లక్షల 80 వేల రూపాయలను డీసీపీ రాధా కిషన్ నేతృత్వంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్ కు చెందిన గుజరాత్ నివాసి జయేష్ కుమార్ పటేల్ సిబ్బందిని నియమించుకుని తరువాయి 2లో






## ప్రచారంలో పకోడా బ్రేక్!

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ



బెంగళూర్ : పకోడాలు అమ్ముకోవడాన్నీ ఉపాధిగా గుర్తించాలని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యల అనంతరం దేశంలో పకోడా రాజకీయాలు ఊపందుకున్నాయి. వివిధ పార్టీల నేతలు పకోడా వ్యాఖ్యలపై అభ్యంతరం తెలపగా.. విద్యార్థులు, నిరుద్యోగులు పకోడాలు అమ్ముతూ నిరసనలు చేపట్టారు. తాజాగా కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ తన ప్రచారానికి కొద్దిసేపు విరామంగా పకోడా బ్రేక్ తీసుకున్నారు.

రాయ్‌చూర్ జిల్లాలో సీఎం సిద్ధరామయ్య, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలిసి పకోడాల విందు ఆరగించారు. పకోడాలు అమ్ముకుని రోజుకు రూ 200 ఇంటికి తీసుకువెళితే అది ఉపాధి కాదా అంటూ ఓ న్యూస్‌ఛానెల్‌తో మాట్లాడుతూ మోదీ ప్రశ్నించడం పెనుదుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత పీ చిదంబరం దీటైన కౌంటర్ ఇచ్చారు. పకోడాలు అమ్ముకోవడం ఉపాధి అయితే భిక్షాటన కూడా ఉద్యోగమేనంటూ సెటైర్లు వేశారు.

ఎన్ని నిధులిచ్చినా

# ఇవ్వలేదనటం తగదు

- రాష్ట్రానికి కేంద్ర సాయంపై వ్యతిరేకత వద్దు
- ఏ రాష్ట్రానికి ఇవ్వనన్ని నిధులు ఏపీకిచ్చాం
- రాష్ట్రంలో నెలకొన్నదంతా పొలిటికల్ డ్రామా
- ఎంపీల అర్ధనగ్న ప్రదర్శనలు జుగుప్సాకరమైనవి
- ఏపీ భాజపా శాసనసభా పక్షనేత విష్ణుకుమార్ రాజు



విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు సహాయం చేసినంతగా స్వతంత్రం వచ్చాక ఏ ప్రభుత్వమూ చేయలేనంత సహాయం ఎన్డీయే ప్రభుత్వం చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కొరకు ఎన్ని నిధులిచ్చినా ఇవ్వలేదనటం తగదని ఏపీ భాజపా శాసనసభా పక్షనేత పెనుమత్స విష్ణుకుమార్ రాజు తీవ్రంగా దుయ్యబట్టారు. సోమవారం ఓ ప్రారంభోత్సవంలో మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే ఏ రాష్ట్రానికీ ఇవ్వనంత నిధులు ఏపీకీ సమకూర్చారని ఆయన అన్నారు. స్వతంత్రం వచ్చాక భారత దేశాన్ని పాలించిన ఏ ప్రభుత్వమూ భారతీయ జనతా పార్టీవలే అభివృద్ధి చేయలేదని, రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధులిస్తున్నామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. అయితే ఇటీవల కాలంలో మిత్ర పక్షమైన టీడీపీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. కేంద్రం నుంచి ఎన్ని నిధులొచ్చినా సంతృప్తి చెందక అన్ని రాష్ట్రాలతో సమానంగానే ఏపీకి నిధులు కేటాయిస్తున్నదే తప్ప ప్రత్యేకతఏమీ లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద 2022 సంవత్సరానికి పేదలకు పక్కా ఇళ్లు కేటాయించడమేది ప్రత్యేక పథకమని అన్నారు. తరువాయి 2లో

# క్వారీ స్థలంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

## సంఘటన స్థలంకు చేరుకున్న పోలీసులు



పెందుర్తి : వి.ఎస్.పి 12.2 క్వారీ సైటు గొడవ ( పెందుర్తి ) క్వారీ స్థల విషయంలో రెండు వర్గాల మధ్యా ప్రచ్ఛన్నయుద్ధం దారి తీసింది. ఈ సంఘటన విశాఖపట్నం జిల్లా, పెందుర్తి మండలం, పోర్లుపాలెం గ్రామంలోగత రెండు రోజులుగా ఉద్రిత్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సంఘటనలో ఈ గ్రామ మాజీ సర్పంచ్కాకర మల్లయ్య స్వల్పంగా గాయపడ్డారు. దీనితో సదరు సర్పంచ్ ముగ్గురు వ్యక్తులపై ఎట్రాసిటి కేసు ఇచ్చారు. దీనితో ఈ వివాదం విశాఖ నగర పోలీస్ కమీషనర్ వద్దకు చేరింది. పోర్లుపాలెం గ్రామంలో2016 సంవత్సరంలో కాకర మల్లయ్య 4.80 సెంట్లు భూమిలో క్వారీ త్రవ్వకాలకు అనుమతిని తీసుకున్నారు. ఆ తరువాత ఈ స్థలం మాదే నంటూ ఇదే గ్రామానికి చెందిన కొంత మంది అభ్యంతరం చెప్పడంతో కారీ స్థలం వివాదంలో ఉంది. ఇదిలా ఉండగా ఆదివారం సాయింత్రరం ఇదే గ్రామానికి చెందిన రాపర్తి అప్పారావు, రాపర్తి కిషోర్, రాపర్తి సురేష్ లతో పాటు మరి కొంత మంది ఈ వివాద స్థలంలో కంచె వేసే పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కాకర మల్లయ్య కారీ స్థలం వద్దకు వచ్చ కంచెను అడ్డుకున్నారు. ఈ వివాదంలో మల్లను పై వ్యక్తులు కులం పేరుతో దుషిస్తూ గాయపరిచినట్లు మల్లయ్య పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎ.సి.పి అర్జున్ సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది ఈ స్థలాన్ని సర్వే చేయించే పనులు చేపట్టారు. ఈ కేసును నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎ.సి.పి అర్జున్ మీడియాకు వివరించారు. ఇదిలా మల్లయ్య ఫిర్యాదు చేసిన ముగ్గురులో ఒకరైన రాపర్తి సురేష్ మీడియాతో మాట్లాడుతూ మా సాగులో సర్వే నెం. 74 20లో 4.40 సెంట్లు భూమి ఉందని ... కాకర మల్లయ్యకు ప్రభుత్వం 74 8 లో భూమికి పట్టాయిచ్చారని చెప్పకుంటున్నారని... మా భూమిలోకి మల్లయ్య వచ్చి దౌర్జన్యంగా క్వారీ త్రవ్వకాలు జరుపడానికి ప్రయత్నిస్తూండగా ... మేము అడ్డు కున్నామని ... దీనితో మల్లయ్య మాపై ఎట్రాసీటి కేసులు బనాయిస్తున్నారని సురేష్ తెలియజేసారు.

# ఘనంగా పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న కె గోపాల్ రెడ్డి

విశాఖపట్నం: పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి జన్మదినోత్సవ వేడుకలు సోమ వారం ఘనంగా జరిగాయి. 31వ వార్డులోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో నగర కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్, నగర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కె గోపాల్రెడ్డి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తుండడం అభినంద నీయమన్నారు. ఆయన స్ఫూర్తితో పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బెహరా భాస్కరరావు సహకారంతో కాంగ్రెస్ పార్టీని వార్డు స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్ర నలుమూలల తిరుగుతూ కార్యక్రమాలు చేపట్టి కార్యకర్తలకు భరోసా నిస్తున్నారన్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎండగడుతూ ప్రజల తరుపున పోరాటం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నేతలు మధుర, రాజు, బీబీ, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పుస్తకాలు ఈ-సేవ ద్వారానే మార్పు

## ఆర్డీవో కె సూర్యారావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : పట్టాదారు పాసు పుస్తకాలలో ఏమైనా మార్పులు చేర్పులు చేయాలంటే ఈ సేవ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని రెవిన్యూ డివిజనల్ అధికారి కె.సూర్యారావు తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామంలో ఒకరు చెరువును ఆక్రమించి అమ్మివేయడం జరిగిందని చెబుతూ ఫిర్యాదు చేశారు. రోలుగుంట మండలం జి. నాయుడుపాలెం లో పింఛను మంజూరీకి కార్యకర్తలు ఐదువేలు అడుగు తున్నట్లు ఒక మహిళ ఫిర్యాదు చేశారు. వీటి పై స్పందించిన ఆర్టీవో వీటన్నింటిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం పరిపాలనాధికారి మీ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



సోమవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్లో ఏర్పాటు చేసిన ఓటు హక్కు నమోదు కేంద్రంలో యలమంచిలి ఎమ్ఎల్ఎ పంచకర్ల రమేష్బాబు, జెడ్పి ఛైర్పర్సన్ లాలం భవాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పిపి రాజాన రమేష్ కుమార్, జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు జనపరెడ్డి నరసింగరావు, ఉమ్మిడి అప్పారావు తదితరులు ఉన్నారు.

### విద్యుత్ దీపాలతో

# పెదముషిడివాడ, కన్నూరు కళకళ

## అనందోత్సవములో గ్రామస్తులు

పరవాడ:పరవాడమండలముపెద ముషిడివాడ, కన్నూరు గ్రామలల్లో వీదివీదిలావిద్యుత్ దీపాలుతో కళకళలు డుతున్నాయి. సోమవారము పెదముషిడివాడ కార్యదర్శియస్ .ప్రశన్నకుమార్ విజయబాను ప్రతినిదితో మాట్లడుతూ కన్నూరు గ్రామంలో మూడువందలయాభైఎల్ ఇడిబల్బులు, పెదముషిడివాడలో నాలుగువందలు ఎల్ ఇడి బల్బులు గ్రామం నలుమూలలు అమర్చామని అన్నారు.

# నులిపురుగుల మాత్రలు పంపిణీ




నర్సీపట్నం : నర్సీపట్నం మండలం వేములపూడి పిహెచ్సి ఆధ్వర్యంలో యువక్లినిక్ సురేష్కుమార్ నేతృత్వంలో నులిపురుగుల మాత్రలు పంపిణీ, వేసే కార్యక్రమంచేపట్టారు. ఈ కార్యక్రమంలో వేములపూడి వైద్యాధికారి స్వాతికుమార్, హెచ్వి.త్రివేణి పాల్గొన్నారు. ధర్మసాగరం ఎంపిపి స్కూల్లో ఎంపిపి సుకల రమణమ్మ ఈ మాత్రలను పంపిణీ చేశారు.

## ఈ నెల 18న అంబేద్కర్ భవన్లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గ సమావేశం

విశాఖపట్నం : నాయీ బ్రాహ్మణ సేవాసంఘం కార్యవర్గ సమావేశం సోమవారం పంజాబ్ హోటల్ జంక్షన్ కార్యాలయంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సమాఖ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల 18వతేదీన అంబేద్కర్ భవన్ వద్ద జరుగునని ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సోదరులు భారీగా కదలిరావాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడు నరవ పైడిరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నింటి ఆదిమూర్తి యాదవ్, దేవగుప్త రమేష్, సిహెచ్.అప్పలరాజు, కోడూరి గణపతి, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నో ప్రవేశాల దరఖాస్తుకు గడువు ఈనెల15




విశాఖపట్నం: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) 2018 ప్రవేశాలకు ఈ నెల 15వతేదీ గడువు ముగియనుందని ఇగ్నో విశాఖపట్నం డైరక్టర్ డాక్టర్ రాజారావు ఒక ప్రకటలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా మాస్టర్స్, పిజీ డిప్లమా, సర్టిఫికెట్స్ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టనున్నారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు యానాంవాసులు ఈ నోటిఫికేషన్ ద్వారా ఇగ్నో విశాఖలో ప్రవేశాలు పొందవచ్చు. పూర్తి వివరాలకు ఇగ్నో విశాఖపట్నం వెబ్సైట్ను సందర్శించవచ్చు.

# మాసాంతంలోపు మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ప్రవీణ్కుమార్

విశాఖపట్నం: ఈ మాసాంతంలోపు అన్ని మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మరుగుదొడ్ల నిర్మాణం, జియోట్యాగింగ్ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చాలా సీరియస్గా వున్నారని, తరచుగా సమీక్షిస్తున్నారని, సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించినటన్లు తెలిపారు. ఈ పనులను అన్నింటినీ సకాలంలో పూర్తి చేసేలా రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.సృజన, జయప్రకాష్ నారాయణ్, కల్యాణ చక్రవర్తి, ఎస్.ఇ.మెహర్ప్రసాద్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## 116 రోజులపాటు నీరు-ప్రగతి

అన్ని నదులను అనుసంధానం చేస్తామన్నారు. రాయలసీమను రతనాల సీమగా చేసి చూపిస్తామని సీఎం స్పష్టం చేశారు. రెండేళ్లు వర్షాలు పడకపోయినా నీటికి కొదవ లేకుండా చేస్తామన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. కొండవీటివాగు, పాలవాగులను సమర్థవంతంగా పూర్తి చేస్తామని, పులిచింతల నుంచి సముద్రం వరకు జల రవాణాను అభివృద్ధి చేస్తామని, బ్లూ అండ్ గ్రీన్ నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## మస్కట్లో నరేంద్ర మోదీ

శివాలయాన్ని సందర్శించారు. ఆలయంలో పూజలు చేసిన అనతరం వెలుపలే వేచియున్న భారతీయ సంతతికి చెందిన వారితో ఆయన ముచ్చటించారు. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న అతి పురాతన ఆలయాల్లో ఈ శివాలయం ఒకటి. ఒమన్ సుల్తాన్ ప్యాలెస్కు సమీపంలో ఉన్న ఈ ఆలయాన్ని గుజరాత్కు చెందిన వ్యాపార వర్గాలు 125 ఏళ్ల క్రితం నిర్మించారు. 1999లో దీనిని పునరుద్ధరించారు. ఈ ఆలయంలో ప్రధాన దేవతామూర్తులుగా శ్రీ ఆది మోతీశ్వర్ మహదేవ్, శ్రీ మోతీశ్వర్ మహదేవ్, శ్రీ హనుమాన్జీ ఉన్నారు. పండుగలు, ప్రధాన ఉత్సవాల్లో ఈ ఆలయాన్ని 15,000 మందికి పైగా భక్తులు దర్శిస్తుంటారు. ఆలయ దర్శనానంతరం సుల్తాన్ ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించేందుకు మోదీ వెళ్లారు. అక్కడినుండి ఆయన తిరిగి ఇండియాకు పయనమవుతారు.

## బడ్జెట్ కేటాయింపులపై చర్చలు జరుగుతున్నాయి

సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఇది సందర్భం కాదన్నారు. బడ్జెట్ కేటాయింపులపై చర్చలు జరుగుతున్నాయని., కేంద్ర-రాష్ట్ర కమిటీలు సైతం అధ్యయనం చేస్తున్నాయన్నారు. మార్చి నెలాఖరుకు ఆ విషయాలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా భోగాపురం ఎయిర్పోర్టు టెండర్ల రద్దు విషయంపై స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి తానే సలహా ఇచ్చానని తెలిపారు. భారత ప్రభుత్వ విమానయాన సంస్థకు తగిన సామర్థ్యం లేని కారణంగానే ఆ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనిపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు వాస్తవ విరుద్ధమని మంత్రి పేర్కొన్నారు.

## హక్కులను కాపాడుకుందాం

ప్రత్యేక హోదా తప్పకుండా ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. 8న చేపట్టిన రాష్ట్ర బంద్లో చాలామంది పాల్గొని విజయవంతం చేశారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రావాల్సిన వాటిపై పోరాటం చేస్తామన్నారు. ఈనెల 18న ఎంపీలు, విద్యార్థులు, ప్రజాసంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## హవాలా రాకెట్ గుట్టురట్టు

మరీ ఈ హవాలా వ్యాపారం నడుపుతున్నాడు. కోటి రూపాయల మార్పిడికి 60 నుంచి 80 వేల రూపాయలు తీసుకుంటూ సంవత్సరానికి 200 కోట్ల హవాలా వ్యాపారం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నగదు అక్రమ తరలింపునకు ద్విచక్రవాహనాలు వాడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అబిడ్స్ లోని జయేష్ కుమార్ కార్యాలయంపై దాడి చేసి నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 6 చరవాణులు, డబ్బు లెక్కించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. లభించిన ఆధారాలతో నగరంలో మరిన్ని సోదాలు చేసి హవాలాపై ఉక్కుపాదం మోపుతామని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్రావు స్పష్టం చేశారు.

## శరవేగంగా సీఐఐ సదస్సుకు ఏర్పాట్లు

సిఐఐ ప్రతినిధి శివకుమార్, పరిశ్రమలు, ఏపిఐఐసికు చెందిన అధికారులతో ఆయన సమావేశమై సదస్సు నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ గతంలోకంటే ఒకటిన్నర రెట్లు భారీ స్థాయిలో ఈ ఏడాది సదస్సు నిర్వహించేందుకు సన్నావలు చేస్తున్నామన్నారు.

24న జరగబోయే ప్రారంబోత్సవ కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అశోక్ గజపతిరాజు, సురేష్ ప్రభు తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. చివరి రోజు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. వీరితోపాటు 18 దేశాలకు చెందిన మంత్రులు, 2వేల మంది ప్రతినిధులు, దేశంలోని ప్రముఖ పారిశ్రామిక దిగ్గజాలు కూడా ఈ సదస్సుకు హాజరవుతారన్నారు. వీరందరికీ ఘనంగా ఆహ్వానం పలికేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో భాగంగా సదస్సు జరిగే గ్రౌండ్స్లోనే దక్షిణ భారత దేశంలోనే అతి పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి 26న ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు. దీని నిర్మాణ పనులను లాలూ గ్రూపునకు అప్పగించడం జరిగిందన్నారు. అదే రోజు విశాఖలో కియో మోటార్స్ కంపెనీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు.

**ఎక్కువ శాతం ఒప్పందాలు అమల్లోకి..**

వైబ్రెంట్ గుజరాత్తో పోల్చుకుంటే గతంలో విశాఖ నగరంలో రెండు సార్లు నిర్వహించిన పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో జరిగిన పలు ఒప్పందాలు ఎక్కువ శాతం అమల్లోకి వచ్చాయని మంత్రి తెలిపారు. సుమారు రూ. 10.97 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 876 ఒప్పందాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. దీని ద్వారా అధిక శాతం ఉద్యోగులకు అవకాశం కలగనున్నాదన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామలింగరాజు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ యతిరాజులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఎన్ని నిధులిచ్చినా ఇవ్వలేదనటం తగదు

అందులో కేవలం మన రాష్ట్రానికే 6 లక్షల 80 వేల ఇళ్ళు ఇవ్వడం జరుగుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్, బిహార్లో కూడా ఇన్ని ఇళ్లు కేటాయించలేదని, ఇది సామాన్యమైన విషయం కాదని ఆయన తెలియజేశారు. ఒక్కో ఇంటికి కేంద్ర ప్రభుత్వం తన వాటాగా లక్షా 50 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కూడా సుమారు 100 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఏపీ రాజధాని నిర్మాణానికి 2,500 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలను అమరావతి - గుంటూరు మధ్య అండర్ గ్రౌండ్ ఏర్పాటుకు కేటాయించడం జరిగిందన్నారు. రహదారుల నిర్మాణాకి లక్ష కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ముందుగా భూసేకరణకు కావలసిన నిధులు కేంద్ర ప్రభుత్వం అందజేయడం జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో తెలుగుదేశం వారు ఈ ప్రాజెక్టులన్నీ పీఓటీ, పీపీపీ కింద ప్రయివేట్ వ్యక్తులు అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం అనడాన్ని ఆయన తప్పుపట్టారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు వారి పార్టీ పెద్దల ఆదేశాల మేరకు భాజపాపై బురద చల్లడం దారుణమన్నారు. డిల్లీలో బహిరంగంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ ఎంపీలు చేస్తున్న ఆందోళన కార్యక్రమాలు చూస్తుంటే ఎంతో సిగ్గుచేటన్నారు. ఏదైనా నిరసన తెలియజేయాలంటే సామరస్యంగా తెలియపరచడమే సంస్కారంగా ఉంటుందని అయితే, సదరు ఎంపీలలో ఒకరు అర్థనగ్న ప్రదర్శనలు చేసి తెలుగువారి ఆత్మ గౌరవాన్ని నడిబజారుకీడ్చడం దుష్పరిణామమన్నారు. ఇది జుగుప్సాకరమైన విషయమన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం హెడ్క్వార్టర్స్గా రైల్వే జోన్ కావాలన్నదే ప్రతీ ఒక్కరి ద్యేయమని, అందుకు అందరం కలిసికట్టుగా ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. ఈ రైల్వే జోన్ విషయం కేంద్ర పరిశీలనలో ఉందని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రాభివృద్ధి కొరకు జేఏసీ ఏర్పడడం శుభపరిణామమని, ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్రంలో నెలకొన్నదంతా పొలిటికల్ డ్రామాగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో భాజపాపై ఒక పథకం ప్రకారం కుట్ర జరుగుతోందని, ప్రజల్లో బిజెపిని ఒక శతృవుగా ముద్ర వేయాలనేదే టిడిపి ధ్యేయంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మంత్రులు తెలుగుదేశం పార్టీ ఉంటేనే ఈ రోజు రాష్ట్రంలో బిజెపి ఉందని ప్రచారం చేయడం హేయనీయమని అన్నారు. గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు కుదుర్చుకోవడం వలననే ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చలామణి అవుతున్నారని, ఆనాడు బిజెపితో పొత్తులేకుంటే ఈనాడు సీఎం కుర్చీలో చంద్రబాబు ఉండేవారు కాదని అన్నారు.

# టీమిండియాకు సంప్రదాయ స్వాగతం

పోర్ట్ ఎలిజబెత్: ఐదో వన్డే కోసం రెండు రోజుల ముందుగానే పోర్ట్ ఎలిజబెత్కు చేరుకున్న టీ మిండియాకు సంప్రదా యకరీతిలో ఘనస్వాగతం లభించింది. కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లీలతో పాటు ఇతర ఆటగాళ్లు తాము బస చేసే హోటల్కు చేరుకోగా ఎంట్రెన్స్ ముందు సంప్రదాయక దుస్తులు ధరించిన కళాకారులు డ్రమ్స్తో స్వాగతం పలికారు. ఈ సంగీతానికి ఆటగాళు కూడా ఫుల్ ఎంజాయ్ చేస్తూ కనిపించారు. మరోవైపు 1992 నుంచి ఇక్కడి సెయింట్ జార్జ్ పార్క్లో దక్షిణాఫ్రికాతో నాలుగు మ్యాచ్లు జరగ్గా భారత్కు అన్నింటా పరాజయాలే ఎదురయ్యాయి. అయితే ప్రస్తుతం ఆరు వన్డేల సిరీసలో భారత జట్టు హ్యాట్రిక్ విజయాలు సాధించి 3-1తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. శనివారం వాండరర్స్ మైదానంలో భారత్కు సఫారీలు షాక్ ఇచ్చి సిరీసలో ఆశలు నిలిపారు. కానీ తమ లోపాలను సరిదిద్దుకుని మరోసారి ప్రత్యర్థిపై విరుచుకుపడి ఈ వేదికపై తొలి విజయంతో పాటు సిరీసను కూడా దక్కించుకోవాలనే ఆలోచనతో విరాట్ కోహ్లీ సేన కసితో ఉంది.

# మరుగుదొడ్ల పరిశుభ్రతపై వివరాలందించండి

**- నిబంధనల మేరకు అన్ని మరుగుదొడ్లలో మౌలిక సదుపాయాలు**
**- అన్ని మరుగుదొడ్లలో టాబ్లెట్ పిసిలు**
**- గ్రీన్ బటన్-బాగుంది, ఎల్లో బటన్-ఫర్వాలేదు, రెడ్ బటన్-బాగాలేదు**
**- ఆశించిన రీతిలో మరుగుదొడ్డి పరిశుభ్రంగా లేకుంటే**
**టోల్ ఫ్రీ నెంబరు : 1800 4250 0009/0891-2569335కు ఫోన్ చేయండి**
**- అన్ని షాపుల్లో డస్ట్‌బిన్స్ ఏర్పాటు**
**- రహదారిపై ఇసుక, చెత్త కాగితాలు లేకుండా చూడాలి**
**- జివిఎంసి, ఆర్టీసీ కాంప్లెక్స్ మరుగుదొడ్లు పరిశీలన**
**కమిషనర్ హరినారాయణన్**




విశాఖపట్నం : ప్రజా-కమ్యూనిటీ మరుగుదొడ్లు వినియోగించిన అనంతరం రేట్ మై టాయిలెట్ ద్వారా స్పందన తెలియజేయాలని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీకి ఎదురుగానున్న మరుగుదొడ్లను, ఆర్టీసీ కాంప్లెక్స్, టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లలో నెలకొల్పిన ప్రజా కమ్యూనిటీ టాయిలెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని మరుగుదొడ్లలలో రేట్ మై టాయిలెట్ ద్వారా స్పందన తెలియజేయాలని ప్రజలను కోరారు. పరిశుభ్రంగా వుంటే గ్రీన్ బటన్, ఫర్వాలేదనిపిస్తే ఎల్లో బటన్, బాగాలేకపోతే రెడ్ బటన్ నొక్కి స్పందన తెలియజేయాలని పేర్కొన్నారు. మరుగుదొడ్డి సక్రమంగా లేకపోయినా, పనిచేయకపోయినా జీవీఎంసీ టోల్ ఫ్రీ నెంబరు 1800 4250 0009/0891-2569335కు ఫోన్ చేయాలని తెలిపారు. నగర వాసులు స్వచ్ఛతకు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అందరు షాపు యజమానులు డస్ట్‌బిన్ తప్పనిసరిగా వినియోగించి, స్వచ్ఛతకు దోహదపడాలని అభిలషించారు. అదే విధంగా శానిటరీ సిబ్బంది రహదారిపై, బెర్మ్ ఎడ్జ్‌లలోని ఇసుకను, రోడ్లపై కాగితాలను పరిశుభ్రం చేయడం ద్వారా శతశాతం స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. తొలుత కమ్యూనిటీ టాయిలెట్స్/పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించి పలు సూచనలు చేసారు. అనంతరం పోర్టు స్టేడియం 'ఎ' గేటు వద్ద నిర్మాణంలో వున్న డ్రెయిన్‌ను పరిశీలించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి పూర్తి చేయాలని, ఇఇకి అప్పగించాలని జోనల్ కమిషనర్ నల్లనయ్యకు ఆదేశించారు. పర్యటనలో మూడో జోన్ జెడ్సీ చిట్టిబాబు, సిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎ.హేమంత్, ఇఇ గణేష్‌కుమార్, ఏఎంహెచ్ఓ డాక్టర్ డాక్టర్ సుధాకర్, ఏసీపీ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పారావులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏఎస్‌పేట అభయాంజనేయ తీర్థం



అనకాపల్లి : కశింకోట మండలంలోని అమీన్ సాహెబ్‌పేట గ్రామంలో శ్రీ అభయాం జనేయ స్వామి తీర్థం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, చేసారు. శాసన సభ్యుడు పీలా గోవింద సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్త మలసాల రమణారావు, ధనమ్మ దంపతులు స్వామివారికి పూజలు చేశారు. రాష్ట్రమంత్రి గంటా శ్రీనివాస రావు సతీమణి శారద స్వామివారిని దర్శించుకుని తీర్థాన్ని తిలకించారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తీర్థాన్ని పురస్కరించుకుని గ్రామంలో సాయంత్రం జిల్లా స్థాయి గుర్రం పరుగుపందెం, ఎడ్ల బండి పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పోటీ దారులు ఉత్సాహంగా హాజ రయ్యారు. విజేతలకు ఆర్ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మలసాల రమణా రావు బహు ముతులు అందజేసారు. ఆలయ కమిటీ చైర్మన్ మలసాల కుమార్‌రాజా, ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## శ్రీ అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఏఎంసీ ఛైర్మన్

అనకాపల్లి : కశింకోట మండలంలో గురువుభీమవరంలో శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి, స్వామి వారికి విశేష అభిషే కాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి సర్పంచ్ ద్వారపూడి సత్తిబాబు స్వాగతం పలకి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

## ముగిసిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు




విశాఖపట్నం : చెస్ ప్లేయర్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ బివి.రమణమూర్తి, విశాఖ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలను ఆటపాటల్లో రాణించేలా వారి తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని సూచించారు. చదరంగం ఆటను నేర్పించడం ద్వారా వారి మేథస్సుకు పదును పెట్టడంతో పాటు పోటీతత్వం పెరుగుతుందని, క్రీడలతో పాటు చదువులోనూ సమాంతరంగా రాణించేలా ప్రోత్సాహించాలని సూచించారు. ఈ పోటీలను పేరెంట్స్ స్వయంగా నిర్వహించడం అభినంద నీయమని ప్రశంసించారు.

భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ పోటీలకు స్వాతి ప్రమోటర్ ఛైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి ఆర్థికసాయం అందజేశారు కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, సభ్యులు అరుణకుమార్, మహాలక్ష్మినాయుడు, నాగార్జున, రాజు ఆడారి, ప్రకాష్‌రెడ్డి, సురేష్‌కుమార్, కృష్ణవేణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## జి.వి.ఎం.సి గ్రీవెన్స్ సెల్‌కు 171 ఫిర్యాదులు

విశాఖపట్నం : జి.వి.ఎం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 171 ఫిర్యాదులు, విజ్ఞప్తులు అందినట్లు కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కమిషనర్ విజ్ఞప్తులు స్వీకరించారు. ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం ఫిర్యాదుల్లో 61 ప్రధాన కార్యాలయానికి సంబంధించినవి కాగా 1వ జోన్‌కు 15, 4వ జోన్‌కు 19, 5వ జోన్‌కు చెందిన ఫిర్యాదులు 57, 6వ జోన్‌కు 19 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

## డయల్ యువర్ కమిషనర్‌కు 9 ఫిర్యాదులు

విశాఖపట్నం : జి.వి.ఎం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (టోల్ ఫ్రీ నెంబరు 1800 4250 0009) కార్యక్రమానికి 9 ఫిర్యాదులు అందినట్లు ఏడీసీ (ప్రాజెక్టులు) సకలారెడ్డి కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో మూడో జోన్ నుండి మూడు, నాలుగో జోన్ నుండి రెండు, ఐదవ జోన్ నుండి రెండు, ఆరవ జోన్ నుండి రెండు కాల్స్ అందినట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరారు.

# ప్రజలకు అందుబాటులో మాధవస్వామి కల్యాణమండపం

**- రూ.18లక్షల వ్యయంతో మహిళా కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన**
**- ఉత్తర నియోజకవర్గ అభివృద్ధే ప్రథమ కర్తవ్యం**
**- కల్యాణమండపం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు**

మాధవధార : గ్రేటర్ విశాఖ 39వవార్డు మాధవధారలో గల శ్రీ మాధవ స్వామి కళ్యాణ మండపం హుదూద్ తుఫాన్‌లో పూర్తిగా ధ్వంస మవడంతో జివియంసి వారు సుమారు రూ.40 లక్షలతో పునఃర్నిర్మాంచారు. ఈ మండపాన్ని సోమవారం ఉత్తర నియోజక వర్గం శాసన సభ్యులు పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుదుద్ తుఫాను ధాటికి పూర్తిగా ధ్వంసం అయ్యిం దని అన్నారు. ఈ ప్రాంతంలో ఉండే ప్రజలు కళ్యాణ మండపాన్ని పునర్నిర్మించాలని పలుమార్లు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు.

రూ. 40 లక్షలతో ఈ కళ్యాణ మండపాన్ని పునర్నిర్మించామని తెలిపారు.



కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న విష్ణుకుమార్‌రాజు, సీతారామాంజనేయులు



మహిళా కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న విష్ణుకుమార్‌రాజు

నిరుపేదలకు, సామాన్య ప్రజలకు ఇక నుండి అతి తక్కువ వ్యయం చెల్లించే విదంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అతి తక్కువ వ్యయంతో జివిఎంసి నిర్వహించే విదంగా కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా ఉత్తర నియోజక వర్గం ఫరిదిలో రూ. 4 కోట్లులతో అభి వృద్ధి పనులను నిర్వహించను న్నట్లు ఆయన తెలిపారు. అదే విదంగా రానున్న అర్ధిక సంవత్సం తరువాత రూ. 15 కోట్లు నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు.

ప్రజలు తమ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

ఎటువంటి సమస్యనైన పరిష్కరిస్తానని హమి ఇచ్చారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 10 లక్షల ఇండ్లును కేటాయిం చిందని ఉత్తర నియోజక వర్గం ఫరిదిలో 6080 ఇండ్లును కేటా యించిందని అన్నారు.

అంతకు ముందు మాధవస్వామి కళ్యాణ మండపం అవరణలో రూ. 18.50లతో నిర్మించనున్న మహిళాలకు సామాజిక భవనాన్ని శంకుస్థాపన చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో...

మాజి కార్పొరేటర్ సనపల సీతారామాంజ నేయులు, నగర తెలుగు యువత ఉపాధ్యక్షుడు సనపల వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మూల వెంకటరావు, ఉత్తర నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు దుర్గా ప్రసాద్, సీనియర్ బీజేపీ నాయకులు పృధ్వీరాజ్, నాయుడు పాండ్రంకి, శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్షులు భగవతి శ్రీరామూర్తి, జివిఎంసి జోన్ - 4 కమిషనర్ ఎస్.రమణ మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి రాజేశ్వరరావు, సహయక వైద్య అధికారి మురళీ మోహన్, వర్క్స్ ఎఈ గుప్త, తెలుగు దేశం పార్టీ నాయకులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# నేడు 82వ త్రిమూర్తి శివజయంతి వేడుకలు

**గీతాజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు**

**ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి రమాదేవి**




విశాఖపట్నం : ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (హెచ్.బి. కాలనీ) కార్యాలయంలో మంగళవారం 82వ త్రిమూర్తి శివజయంతి వేడుకలు, గీతాజయంతి ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించ నున్నట్టు విశ్వవిద్యాలయం ప్రతినిధి రమాదేవి తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ పరమాత్ముడి పుట్టినరోజే మానవాళికి పండుగరోజుగా అభివర్ణించారు. మహాశివరాత్రి అంటేనే అభిషేక, ఉపవాస, జాగరణనల ఆధ్యాత్మిక రహస్యంగా పేర్కొన్నారు. శివపరమాత్మ ప్రసాదించిన జ్ఞానమృతబిందువులతో ఆత్మలో వున్న జన్మజన్మాంతారాల పాపమును ప్రక్షాణన చేసుకొని సర్వ ఆత్మలను పవిత్రీకరించుట, ఉపక్రమించటమే అభిషేకము గొప్పతనము అన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి హెచ్.బి. కాలనీ కార్యాలయంలో ఈశ్వరీయ శివజయంతి పతాకాన్ని ఆవిష్కరించటం జరుగుతుందన్నారు. తదుపరి అన్నిమతాలకు చెందిన దైవజ్ఞులు వారి వారి ధర్మప్రబోధాలను విపులంగా వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని పరమాత్ముని యొక్క దివ్యఆశీస్సులు పొందాలని రమాదేవి కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిఏటా మహాశివరాత్రి పర్వదిన వేడుకలను ప్రజాపిత బ్రహ్మకుమారీస్ అత్యంత ఘనంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. శివరాత్రిరోజు అభిషేకాలు నిర్వహించటంతో పాటు ఉపవాసము ఉండి జాగరణ చేస్తే భక్తులు కోరిన కోర్కెలు సిద్ధిస్తాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో జర్నలిస్టులను భాగస్వామ్యులను చేయటం ఆనందంగా వుందని వి.జె.ఎఫ్. కార్యదర్శి ఎస్. దుర్గారావు, ఉపాధ్యక్షులు ఆర్. నాగరాజు పట్నాయక్‌లు ఆనందం వ్యక్తం చేశారు.

ఈశ్వరీయ విశ్వవిద్యాలయంకు నిరంతరం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం శివజయంతి ఉత్సవాల బ్రోచర్, గోడపత్రికలను వీరంతా కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఆహ్వానపత్రికలు, మిఠాయిలు అందజేశారు.

## అంతర్జాతీయ మహిళా అవార్డ్సు కార్యక్రమ గోడపత్రిక ఆవిష్కరణ



విశాఖపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరుమామ వీటీం ఈవెంట్స్ మరియు జె వరల్డ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా అవార్డ్సు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు భూమా అఖిలప్రియ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఆంధ్ర రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా అవార్డ్సు అందజేస్తున్నట్లు వీటీం సీఈఓ వీరుమామ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది సినీ తారలు, డాక్టర్‌లు, పోలీస్ ఆఫీసర్‌లు మరియు వివిధ వృత్తులలో ప్రావీణ్యం సంపాదించినా మహిళలకు ఈ అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ బోర్డు డైరెక్టర్ పి.ఎస్.నాయుడు పాల్గొన్నారు. కిందటి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించి గుత్తా జ్వాలా, సింగర్ సునీత, నన్నపనేని రాజకుమారిని ఘనంగా సన్మానించిన విషయం విదితమే. ఈ సంవత్సరం సింగర్ కల్పనా, నటి రాధికాతో పాటు ఎంతోమంది మహిళామణులు ఈ కార్యక్రమానికి హాజరు అవుతున్నట్లు వీరుమామ తెలిపారు. వైజాగ్‌లో ఇలాంటి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు వీరు మామ వీటీం వారు నిర్వహించడం పట్ల రాష్ట్ర పర్యాటక శాఖా మాత్యులు భూమా అఖిల ప్రియ హర్షం వ్యక్తం చేశారు.

## అనకాపల్లిలో జాతీయ స్థాయి కరాటే పోటీలు

అనకాపల్లి : అనకాపల్లిలో తొలిసారిగా నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. కరాటేలోని అన్ని స్టైల్స్ క్రీడాకారులకు ఒకే వేదికపై జాతీయ స్థాయిలో పోటీలు జరిగాయి.

ఈ పోటీలకు ఆర్గనైజింగ్ చైర్మన్‌గా వేగి త్రినాధ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కాండ్రేగుల నాయుడు వ్యవహరించారు. ఈ పోటీలను ఎస్పై ఎం. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి సుమారు 1600 మంది క్రీడా కారులు తరలివచ్చారు.

వీరందరికీ జూనియర్, సీనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చీఫ్ ఆర్గనైజర్‌గా సూరి (మార్షల్ ఆర్ట్స్) వ్యవహరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

# విజయభాను సంపాదకీయం

## రాజకీయ కల్లోలం

అమెరికా వంటి దేశమే అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలో మాల్దీవులలో ప్రజాస్వామ్యం నెలకొల్పాలనే సూత్రబద్ధ వైఖరిని భారత్ ప్రదర్శించడం మంచిది. మాల్దీవులలో ఎన్నికలను నిర్వహించి చట్టబద్ధపాలన సాగించాలని, న్యాయస్థానం స్వయంప్రతిపత్తిని కాపాడాలని ఐక్యరాజ్యసమితి ద్వారా ఒత్తిడి తేవాలె. మాల్దీవుల ప్రజలతో ఆర్థిక,సాంస్కృతిక సంబంధాలను పెంపొందించుకోవడం దీర్ఘకాలికంగా ఉపయోగకరం. మాల్దీవులలో రాజకీయ పరిణామాలను రాజకీయ విశ్లేషకులు భారత్, చైనా ప్రచ్ఛన్న యుద్ధంగా అభివర్ణిస్తున్నారు. దేశాధ్యక్షుడు యమీన్‌కు చైనా మద్దతు ఉంటే, ప్రతిపక్షానికి భారత్ మద్దతు ఇస్తున్నది. యమీన్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యరాజ్య సమితిలో మద్దతు కూడగడుతున్నది. ఈలోగా యమీన్ తమ ప్రభుత్వానికి మద్దతు కోసం తన మంత్రులను దూతలుగా చైనా, పాకిస్థాన్, సౌదీ అరేబియా దేశాలకు పంపిస్తున్నారు. అంతర్జాతీయ రాజకీయాలు ఎట్లా ఉన్నా, హిందు మహా సముద్ర జలాల్లోని, ఆసియాలోనే అతి చిన్నదైన ఈ సుందర దేశం రాజకీయ కల్లోలంలో కొట్టుమిట్టాడటం విషాదకరం. 2013లో దేశాధ్యక్షునిగా అధికారం చేపట్టిన అబ్దుల్లా యమీన్ క్రమంగా నిరంకుశ అధికారాలు చలాయించడం మొదలుపెట్టాడు. సైన్యంపై పట్టుసాధించి, రాజకీయ ప్రత్యర్థులను అణచి వేస్తున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు దేశాధ్యక్షుడి అభిమతానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడంతో సంక్షోభం మొదలైంది. ప్రభుత్వ నిర్బంధంలో ఉన్న తొమ్మిది మంది అసమ్మతివాదులను విడుదల చేయాలని, అధికార పార్టీని వీడిన పన్నెండు మంది ప్రజాప్రతినిధుల సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ పన్నెం డు మంది మళ్ళా చట్టసభలో ప్రవేశిస్తే, అధికార పార్టీ మెజారిటీ కోల్పోతుంది. సుప్రీంకోర్టు తీర్పును ఆమోదించని దేశాధ్యక్షుడు యమీన్ దేశంలో పదిహేను రోజుల పాటు ఎమెర్జెన్సీ విధించారు. ఇద్దరు న్యాయమూర్తులను అరెస్టు చేయించారు. న్యాయస్థానం చుట్టూరా బలగాలను మోహరించి, మిగతా న్యాయమూర్తులకు చుక్కలు చూపించారు. దీంతో మిగిలిన న్యాయమూర్తులు సమావేశమై గతంలో ఇచ్చిన తీర్పును వెనుక్కు తీసుకున్నారు. దేశాధ్యక్షుడు యమీన్ చెప్పిందే తీర్పుగా మారిపోయింది. భారత్‌కు మాల్దీవులలో ఎంతోకాలంగా పట్టు ఉన్నది. మాల్దీవులలో గయూం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 1988లో చిన్న తిరుగుబాటు తలెత్తింది. వెంటనే భారత నౌకాదళం రంగంలోకి దిగి తిరుగుబాటును అణచివేసి గయూం ప్రభుత్వాన్ని కాపాడింది. భారత్ తెరవెనుక ఉండి తిరుగు బాటును నిర్వహించి, బహిరంగంగా గయూంను కాపాడిందనీ, ఈ విధంగా ఈ ప్రాంతం లో తన అధికారాన్ని చాటుకున్నదని ఒక అభిప్రాయం ఉన్నది. ఏది నిజమైనా మాల్దీవుల ప్రజలతో భారత్‌కు చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు ఎంతోకాలంగా ఉన్నమాట నిజం. మాల్దీవులు సముద్ర మట్టానికి చాలా తక్కువ ఎత్తులో ఉంటుంది. 2004 డిసెంబర్‌లో సునామీ రావడంతో దేశం నీళ్ళతో నిండిపోయింది. భారత్ విమానాలు, హెలికాప్టర్లతో ఆహార పదార్థాలను సరఫరా చేసింది. 12 వందల దీవుల సముదాయం అయినప్పటికీ, ఈ దేశ విస్తీర్ణం 115 చదరపు మైళ్ళు మాత్రమే. జనా భా నాలుగు లక్షల పై చిలుకు. భవిష్యత్తులో సముద్ర మట్టం పెరిగిపోయి, ఈ దీవుల ఉనికి కే ప్రమాదం వస్తే ఆదుకునేది భారత్ అనే అభిప్రాయం ఉంది. కానీ 2013లో యమీన్ దేశాధ్యక్షుడు అయిన తరువాత చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు. చైనాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకొని, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో చేరుతామని ప్రకటించారు. దీంతో భారత్ మాల్దీవులలో శ్రీలంక ప్రయో గం ప్రారంభించింది. గతంలో శ్రీలంకలో రాజపక్సే నిరంకుశ విధానాలను అనుసరిస్తూ, విదేశాంగ విధానంలో చైనాకు అనుకూలంగా మారారు. శ్రీలంకలో ప్రతిపక్షాలన్నీ ఏకాతాటిపైకి వచ్చి, రాజపక్సేను ఓడించడం వెనుక భారత్ హస్తం ఉందనే వార్తలు వచ్చాయి. మాల్దీవులలో కూడా నియంతగా మారిన యమీన్‌ను గద్దె దింపడానికి భారత్ పావులు కదుపుతున్నద నే అభిప్రాయం ఉన్నది. పాకిస్థాన్‌లోని గ్వదర్ రేవును చైనా నిర్మిస్తుంటే, ఇరాన్‌లోని చబహర్ రేవు విస్తరణను భారత్ చేపట్టింది. ఇదే విధంగా ఆఫ్రికాలోని డిజిబౌటిలో చైనా నౌకా స్థావరాన్ని నెలకొల్పింది. భారత్ హిందు మహా సముద్రంలోని సీషెల్స్ అనే చిన్న దేశంలోని అసంప్షన్ అనే దీవిని లీజుకు తీసుకొని నావికా స్థావరం నిర్మిస్తున్నది. అటు మాల్దీవులు, ఇటు సీషెల్స్ చేతిలో ఉంటే సముద్ర మార్గాలపై పట్టు ఉంటుంది. ఈ నేపథ్యంలో చైనా మాల్దీవులపై పట్టు బిగించింది. మోదీ స్పందన దౌత్య వైఫల్యంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

### సిఐ బొక్కా పెద్దిరాజు




రావులపాలెం : మండల పరిధి గోపాలపురం పంచాయితీ ఆవరణలో సిఐ బొక్కా పెద్దిరాజు, ఎస్సై సిహెచ్ విద్యాసాగర్‌ల ఆధ్వర్యంలో మన ఊరు మన పోలీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ప్రజలు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తూ ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా యాత్రలకు, ఊర్లకు వెళ్ళదలిస్తే ఇంటి ప్రక్క వార్కి, స్థానిక పోలీస్ స్టేషనులో సమాచారం అందించి వెళ్ళాలని తెలిపారు. గ్రామంలో బెల్ట్ షాపులు, చట్ట వ్యతిరేఖ, అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని, అటువంటి వాటిని ఎవరైనా ప్రోత్సహించినా, సహకరించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనే లక్ష్మి ముసలయ్య, మైగాపుల గురవయ్య నాయుడు, గ్రామ పెద్దలు, ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ప్రమాదాలపై అవగాహనా కార్యక్రమం



రావులపాలెం : ఇటీవల కాలంలో గ్యాస్ సిలెండర్ల లీకే ప్రమాదాలు సంభవిస్తున్న నేపధ్యంలో అగ్నిమాపక సిబ్బంది, రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజన్సీలు సంయుక్తంగా ఫైర్ & సేఫ్టీ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆదివారం మండలంలో గల గోపాలపురం పంచాయితీ వద్ద సర్పంచ్ ఆనే లక్ష్మి ముసలయ్య ఆధ్వర్యంలో గ్యాస్ సిలెండర్ల వినియోగం, వాటి భద్రత అంశాలపై అగ్నిమాపక అధికారి అవగాహన కల్పించారు. ప్రతి మహిళ గ్యాస్ వినయోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ ఏజన్సీల నుండి సిలెండర్ తమ ఇంటికి తెచ్చిన వ్యక్తిచే సిలెండర్ పరిశీలించి వారితోనే రెగ్యులేటర్ బిగించే ఏర్పాటు చేసుకొని స్టౌవ్ వెలిగించి పరిశీలించుకోవాలన్నారు. సిలెండర్ లీకవుతున్నా, మంటలు వ్యాప్తి చెందే సమయంలో నిటిని పోయకుండా తడి గోనెసంచె లేక తడి బట్ట వేయడంతో మంటలను అదుపు చేయవచ్చన్నారు. ఈ సందర్భముగా అగ్నిమాపక సిబ్బంది పలు విన్యాసాలతో అగ్ని ప్రమాదాల నుండి రక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బి. బాలకృష్ణ, శ్రీనివాస్, రాఘవులు, శ్రీనివాసరావు, నాయకర్, మైగాపుల గురవయ్య నాయుడు, రాహుల్ ఇండేన్ గ్యాస్ సిబ్బంది, గొలుగూరి వీరారెడ్డి, గొర్రెల బోసు, గొలుగూరి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి రెండే వినతులు



ఆలమూరు :- స్థానిక తహశీల్దారు వారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండే అర్జీలు అందగా అందులో చొప్పెల్ల గ్రామానికి చెందిన ఒకరు ల్యాండ్ కన్వర్షను లేకుండా మండలంలో 300 ఇటుక బట్టీ నిర్మాణాలు జరిగినట్లు దీంతో 3 కోట్లు ప్రభుత్వ ఆదాయం నష్టం జరుగుతుందని, దీనిపై సంబంధిత అధికార్లు తగిన చర్యలు తీసుకోవాలని ఒక అర్జీ, అలాగే మూలస్థాన అగ్రహారం గ్రామం నుండి ఒకరు తన పంట భూమి సమీపంలో 10అడుగులు వరకు మట్టిని త్రవ్వినందున తనకు పంటనష్టం ఏర్పడుతుందని దీనిపై ఒక అర్జీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.పద్మావతి, ఎంపిడిఓ నాతి బుజ్జి, కపిలేశ్వరపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బి.విజయశ్రీ, ఏఓ కె.వి.ఎన్. రమేష్ కుమార్, ఎంఈఓ ఎన్.రామచంద్రరావు, పంచాయితీరాజ్, హౌసింగ్ ఏఈలు బి.రంగనాయకులు, ఎస్.జేజిబాబు, ఏపిఓ ఎ.వి. రామారావు, మండల పరిధి కార్యదర్శులందరూ పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

ఆలమూరు :- ఓటు హక్కు మన జన్మ హక్కుగా భావించి 18 సంllలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కె.పద్మావతి తెలిపారు. సోమవారం మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమంపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మండల పరిధి 56 పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతోందని, 14తో గడువు ముగుస్తున్నందున అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.వి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ హుస్సేన్, ఆర్.ఐ. ఎమ్. జానకిరాఘవ, జూనియర్ అసిస్టెంట్ యమున, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఇఇ యూనియన్ సమావేశం

రావులపాలెం : ఎపిఇఇ యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భముగా రావులపాలెం ఎలక్ట్రికల్ సెక్షన్ ఆఫీసు ఆవరణలో బ్రాంచి అధ్యక్షులు ఎమ్‌వి రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ యూనియన్ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, మనమందరం మన సంఘాన్ని పెంపొందించుకొని సమిష్టిగా సంఘ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బొంతు సత్యసాయి ముఖ్య అతిధిగా పాల్గొని పతాకావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి శిరగం ఆదినారాయణరావు, ఎన్. నాగేశ్వరరావు, ఎమ్. నాగేశ్వరరావు, ఎన్. వీరస్వామి, ఆర్. సురేష్‌బాబు, డి. మధు విశ్వ భాస్కర్, డి. శ్రీనివాస్, శీలం శ్రీను, వి. నాగ విష్ణు, వి. వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కవి సమయం

### పరోపకారం ఇదం పుణ్యం

పరోపకార పుణ్యాయ  
పాపాయ పరపీడనం అన్నది ఆర్యోక్తి  
నిరంతరం అప్రమత్తతో  
మెలగడమే అసలు విజయ రహస్యం  
అజాగ్రత్త అపజయానికి సోపానం  
పరోపకారమే లక్ష్యంగా బ్రతికే  
మానవుడికి అమరత్వం సాధ్యం  
రాళ్ళ దెబ్బలు తిన్నా  
తియ్యని ఫలాలను అందించే చెట్లు  
ఔషధం లాంటి కమ్మని  
పాలను ఎల్లెడలా ఇచ్చే గోమాత  
పరోపకార తత్వానికి  
చక్కని నిదర్శనములు

కవిత రచన:  
సి.ప్రతాప్  
సెల్ ఫోన్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : మాఘ; తిథి: త్రయోదశి రా.10.34; ఉత్తరాషాడ తె.5.07; ఉ.వ.11.25ల 1.11. | మంగళవారం 13-02-2018

**మేషం** : దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. స్త్రీల ఆరోగ్యంలో మెళకువ అవసరం. ఆత్మీయులకు విలువైన కాను కలు అందజేస్తారు. ఉద్యో గస్తులు విశ్రాంతికై చేయు యత్నాలు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. **వృషభం** :బంధు మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం. **మిధునం** :ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ రంగాల వారికి ఖాతాదారుల నుంచి ఒత్తిడి, చికాకులు ఎదుర్కొంటారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. **కర్కాటకం** : ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంటర్వ్యూలలో మెళుకవ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. **సింహం** :ఆత్మీయుల మధ్య కానుకలు పరస్పరం ఇచ్చిపుచ్చు కుంటారు. నూతన వ్యాపారాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. దంపతుల మధ్య కొత్తకొత్త విషయాలు చర్చకు వస్తాయి. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి. **కన్య** : వ్యాపారాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. నిరుద్యో గులు ఇంటర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొం టారు. **తుల** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు చక్కగా పరిష్కరిస్తారు. ప్రముఖుల కలయిక ఆశించిన ప్రయోజనం ఉంటుంది. నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురోభివృద్ధికి ఎంతగానో సహకరిస్తాయి. వృత్తి వ్యాపారా లలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం. **వృశ్చికం** :స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదుర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్కసారి ఆలోచించండి. చేతి వృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. ప్రేమికులకు పెద్దల నుంచి ప్రోత్సాహం, సన్ని హితుల సహకారం ఉంటాయి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు. **ధనుస్సు** :ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. నిరుద్యోగులకు మధ్యవర్తుల పట్ల అప్రమత్తత అవసరం. స్త్రీలు, గృహోపకరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనసుకు ఊరట, ఉల్లాసం కలిగించే సంఘటనలు జరుగుతాయి. **మకరం** : మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మనసులో భయాందోళనలూ అనుమానాలూ ఉన్నా, ధాంభికం ప్రదర్శించి పనులు సాఫీగా పూర్తి చేస్తారు. మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయాలేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారా లలో బాగా రాణిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. **కుంభం** : కుటుంబీకులతో కలిసి నూతన ప్రదేశాలను సందర్శిస్తారు. మిత్రుల, సహోదరుల సాయంతో మీ పనులు సులువుగా పూర్తి చేయ గలుగుతారు. వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడటంతో రోజువారీ మీ కార్యక్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగు తుంది. హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు లాభం చేకూరుతుంది. **మీనం** : ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. ప్రచారసాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి. విహార స్థలాలు, దేవాలయాలను సందర్శిస్తారు. స్థిరచరాస్తుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు.

## కుంగ్-ఫూ కరాటే పోటీలలో జొన్నాడ విద్యార్థులు ప్రతిభ




ఆలమూరు :- పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్-ఫూ కరాటే పోటీలలో మండల పరిధి జొన్నాడ విద్యార్థులు పలు విభాగాలలో తమ ప్రతిభను కనపరచి బహుమతులను అందుకున్నారు. కటాస్ - డి విభాగంలో సిహెచ్. రాజశేఖరరెడ్డికి ప్రథమ బహుమతి, బ్రౌన్ బెల్ట్-బి విభాగంలో పి. సందీప్ ప్రథమ బహుమతిని, స్పేరింగ్-ఇ విభాగంలో ఎమ్. మధుసూదన్ ప్రథమ బహుమతులు లభించగా అలాగే స్పేరింగ్-ఎ విభాగంలో వి.తేజకు ద్వితీయ బహుమతులు లభించినట్లు కుంగ్-ఫూ మాస్టర్ కె.సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని సోమవారం గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, ఎల్. వెంకటరెడ్డి, జొన్నాడ సర్పంచ్ చాపల రుతియ్య, ఉపసర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎ.ఎమ్.సి. వైస్ ఛైర్మన్ గొడవర్తి బాబి తదితరులు అభినందించారు.

## శ్రీ దుర్గాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి పూర్ణా మార్కెట్ కూడలిలో వేంచేసిన శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి తిరువీధి మహోత్సవంలో పాల్గొన్నారు. ఉత్స విగ్రహాలను పల్లకిలో మోసి అమ్మకు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ అమ్మ చల్లగా చూడాలని కోరుకున్నారు. ఈవో భానురాజా, భక్తులు, ధర్మకర్తలు, అధికారులు ఆయనను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలేళ్ల మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పులి వేషాలు, సాము గరిడీలు, డప్పు వాయిద్యాలు, సన్నాయి వాయిద్యాలు, మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బుచ్చా రామిరెడ్డి, నాయన రాజారెడ్డి, బుచ్చా అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## స్కూలు విద్యార్థులచే ఫీల్డ్ ట్రిప్

రావులపాలెం : ఆలమూరు, రావులపాలెం సిద్ధార్థ పాఠశాల విద్యార్థులచే శనివారం ఫీల్డ్ ట్రిప్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ముల్లారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫీల్డ్ ట్రిప్‌లో విద్యార్థులను మధురపూడి విమానాశ్రయ సందర్శనకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంలో విద్యార్థులకు విమానాశ్రయ అధికారులు విమాన టేకాఫ్, లాండింగ్, రనవే, ఎయిర్‌పోర్ట్ ఫైర్ స్టేషన్, టెర్మినల్ మొదలైన విషయాలను ప్రత్యక్షంగా చూపించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డైరెక్టర్ ముల్లారావు మాట్లాడుతూ ఇటువంటి ఫీల్డ్ ట్రిప్‌లు విద్యార్థిని విద్యార్థులకు విజ్ఞానంతో బాటు, నూతన ఉత్సాహాన్నిస్తాయన్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవి ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చిప్పాడ లో ఘన వ్యర్థాల నిర్వహణా కేంద్రం పనుల అడ్డగింత

భీమునిపట్నం : భీమిలి మండలం చిప్పాడ లో ఘన వ్యర్థాల నిర్వహణా కేంద్రం పనులను వై.సి.పి. నాయకుల ఆధ్వర్యం లో కొందరు రైతులు అడ్డగించారు. ఇళ్ళ నిర్మాణంకోసం చేతి పంపులు కూడా వేసి ఉంచిన స్థలానికి సమీపంలో ఘన వ్యర్థాల నిర్వహణా కేంద్రం ఏర్పాటు చెయడం సరికాదని ఎం.పి.టి.సి సభ్యులు కంది వలస రమణ,మాజీ సర్పంచ్ సరగడ రఘు నాథ రెడ్డి లు అన్నారు. టి.డి.పి. నాయకులు రాజకీయ కక్షతో ఇలాంటి పనులను చేస్తున్నారని ఆరోపించారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## కల్యాణపులోవ ఉత్సవాలకు 70 ప్రత్యేక బస్సులు

రావికమతం : మండలంలోని కల్యాణపులోవ ఉత్సవాలకు 70 బస్సు సర్వీసులు నడపనున్నామని నర్సీపట్నం ఆర్టీసి సీనియర్ ట్రాఫిక్ ఇన్‌సెక్టర్ రవిచంద్ర తెలిపారు. తమ డిపో నుచి 30, వాల్తేరు, విశాఖపట్నం, మద్దిలపాలెం నుంచి 30, అనకాపల్లి డిపో నుంచి 15 బస్సులు నడుపుతామన్నారు. తిరునాళ్లకు వచ్చే మారుమూల గ్రామాల నుంచి కూడా భక్తులు వచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ బస్సులకు ప్రయాణికులు నుంచి అదనపు చార్జీలు వసూలు చేయబోమని అన్నారు. గురువారం సాయంత్రం నుంచి రావికమతం, కొత్తకోట, నర్సీపట్నం, చోడవరం, దొంగపూడి, అనకాపల్లి, విశాఖపట్నం నుంచి కల్యాణపులోవకు నడిపేందుకు చర్యలు చేపట్టామన్నారు.

## నిరుపయోగంగా తూనిక కేంద్రాలు

కొయ్యూరు : వారపు సంతల్లో రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తూనిక కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రాజేంద్ర పాలెం, డౌనూరు గ్రామాల్లో రూ.6లక్షల చొప్పున ఖర్చు చేసి తూనిక కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిర్మాణాలు పూర్తయి ఏడాది గడుస్తున్నా నేటికి నేటికీ వినియోగంలోకి రాలేదు. గిరిజనులు వారపు సంతలకు తీసుకువచ్చే అటవీ ఫలసాయాలు, వ్యవసాయ ఉత్పత్తులను ఈ కేంద్రాల్లో తూకం వేసి వ్యాపారులకు విక్రయించేందుకు వీలేగా వీటిని ఏర్పాటు చేశారు. వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడకుండా ఏర్పాటు చేసిన కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావడంపై అధికారులు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని విమర్శలు న్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి ఈ కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరం ముంది.

## ఈనెల 16నుంచి ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్

విశాఖపట్నం: ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో ఈనెల 16 నుంచి 26వరకూ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ట్రేడ్ ఫెయిర్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశంలోని 15 రాష్ట్రాలతో పాటు విదేశాలకు చెందిన పలువురు చిన్న తరహా పరిశ్రమలకు చెందిన పలువురు హాజరై దాదాపు 200 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.


సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ట్రేడ్ ఫెయిర్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆ రోజు మంత్రి గంటా శ్రీనివాస రావు కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారని చెప్పారు. ఈ పదిరోజులు చిన్న తరహా పరిశ్రమలు, చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఫర్నీచర్, హోం డెకార్స్, హెర్బల్స్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన క్రాఫ్ట్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ప్రొడక్షన్స్, గృహోపకరణ వస్తువులు, జ్యూవెలరీ, అన్ని దేశాలకు చెందిన డ్రై ఫ్రూట్స్, రకరకాల పెయిం టింగ్స్, ఆరోగ్యానికి సంబంధించి చిట్కాలకు సంబంధించిన వస్తువులుగిఫ్ట్ ఐటమ్స్ వంటి వస్తువులను స్టాల్స్‌లో ప్రదర్శన పెడతారని అన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ



అచ్యుతాపురం: యుక్త వయస్సులో గల బాలికలే ఎక్కువగా రక్తహీనతకు గురౌతున్నారని దీనికి ప్రధాన కారణం నులిపురుగులేనని పిహెచ్‌సి వైద్యాదికారిణి పివివి యోగితా బాల అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బండజోల్) మింగించారు. వైద్యాదికారిణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచి ఆరోగ్య సూత్రాలు పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చన్నారు. ప్రభుత్వం సంవత్సరంలో 2 దఫాలుగా ఈ ఆల్బండజోల్ మాత్రలను ఉచితంగా అందిస్తుందని వీటిని 19 సంవత్సరాలలోపు వారందరూ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య దశ నుండే ఆరు నెలలకు ఒకసారి ఆల్బండజోల్-400 మాత్రలను తీసుకోవాలన్నారు. పిహెచ్‌సి పరిధిలో 5,628 మందికి గాను 4,935 మందికి మాత్రలు మింగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఆర్ఎస్ ప్రిన్సిపాల్ డి.సత్యారావు, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, ఎపిఆర్ఎస్ స్టాఫ్‌నర్స్ జాన్సీ, ఆరోగ్య సహాయకులు లండా అప్పలకొండ, విద్యార్ధినిలు పాల్గొన్నారు.

## వెదురువాడలో రోడ్డుపై తవ్విన గోతులను పూడ్చండి



అచ్యుతాపురం: మండల కేంద్రమైన అచ్యుతాపురానికి కూతవేటు దూరంలో ఉన్న వెదురువాడలో రోడ్డుకు అడ్డంగా తవ్విన గోతులు పూడ్చక పోవడంతో వాహన దారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి నుండి యలమంచిలికి వెళ్లే ప్రదాన రహదారిలో ఎదురువాడ గ్రామం వద్ద ఒక ప్రజా ప్రథినిధి ఇంటికి అవసరాల నిమిత్తం రోడ్డును త్రవ్వి అలానే విడిచిపెట్టారని స్థానికులు అంటున్నారు. ఈ రహదారిలో రోజుకు వేల కొద్దీ వాహనాలు రాకపోకలు జరుగుతూ ఉంటాయి.

అయితే ఈ గోతుల వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే దీనిపై చొరవ తీసికొని రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని పలు వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు. అలాగే అచ్యుతాపురం నుండి అనకాపల్లి వెళ్లే ప్రదాన రహదారి కుడా గోతులమయంగా ఉండటంతో వాహన చోదకులు చాలా ప్రమాదాల బారిన పడుతు న్నారని, దీనిపై అధికారులు చొరవ తీసుకొని మరమ్మత్తులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ఆలయాలకు శివరాత్రి శోభ



కాశీ నుంచి తీసుకువచ్చి ప్రతిష్టించిన శివలింగం

నాతవరం : శివరాత్రి పూజలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. ఉత్సవాల నిర్వహణకు కమి టీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. విబి.అగ్రహా రంలోని రామలింగేశ్వరుని ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. 750 సంవత్సరాల క్రితం కాశీ నుంచి ప్రతిష్టించారు. ఆలయ కమిటీ చైర్మన్ అప్పన్నదివానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

అలాగే జిల్లేడుపూడి బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నాగస ర్పంతో కూడిన శివలింగాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శిస్తారు. ఆలయ నిర్మాణ దాత ప్రభాకరచౌదరి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

అలాగే వెదురుపల్లి శివాలయం, సరుగుడు తదితర ప్రాంతాల్లో శివరాత్రి మహోత్సవాలకు ఆలయాలు సిద్దమయ్యాయి.

## దళితుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

### ఎంపిపి సుకల రమణమ్మ



దళిత వాడల్లో పర్యటిస్తున్న ఎంపిపి

నర్సీపట్నం : దళితుల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. సోమవారం చంద్రన్న ముందడుగు దళిత తేజం కార్యక్రమలో భాగంగా నర్సీపట్నం మండలం యరకన్న పాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా దళితుల కాలనీల్లో తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ దళితుల అభ్యున్నతి కోసం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రన్నారు. దళితుల వాడల్లో పర్యటించి వారి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే ఈ కార్యక్రమ మన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, తెలుగు యువత నల్లబెల్లి తాతాజీ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు విప్స్ ప్రతినిధులకు 'బెస్ట్ ఎంటర్‌ప్రైజె' అవార్డు



గాజువాక: రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్.ఐ.ఎన్.ఎల్) విశాఖ ఉక్కు వుమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్(విప్స్) ప్రతినిధులకు 2017సం.నికి నవరత్న కేటగిరీలో ప్రతిష్టాత్మకమైన బెస్ట్ ఎంటర్‌ప్రైజ్ అవార్డు దక్కింది. సోమవారం గౌహతిలో జరిగిన జాతీయస్థాయి 28వ మీట్‌లో అస్సాం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ చేతులుమీదుగా ఉక్కు మేనేజర్(హెచ్ఆర్), హానరీ ప్రెసిడెంట్ విప్స్ ఆర్.వి.రావులు అందుకున్నారు. ఉక్కులో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకమైనదని, విధినిర్వాహణలో పలు కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరచడం వల్లే ఈ ప్రతిష్టాత్మక అవార్డు దక్కిందని ఉక్కు యాజమాన్యం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమైన విశాఖ ఉక్కు కర్మాగారంలో 1992లో విప్స్ ఫోరమ్ ప్రారంభమైయ్యిందని, అప్పటినుంచి నేటి వరకు విప్స్‌ప్రతినధులు ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్, విమెన్ రెప్రెసెంటేటివ్ ఆన్ రిక్రూట్మెంట్ అండ్ ప్రమోషన్ పానెల్స్, డేటా జనరేషన్, కో ఆర్డినేటర్స్ నెట్-వర్కింగ్ మెంబర్షిప్ డ్రైవ్ ఇనిటిటివ్స్, లైరెల్స్‌బై విమెన్ ఎంప్లాయిస్, సపోర్ట్ సర్వీసెస్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్స్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీస్‌లో భాగస్వాములు అవుతున్నారు. అంతేకాకుండ ఇ.టి.ఎల్ విభాగం సీనియర్ టెక్నీషియన్ కె.రాజ్యలక్ష్మి బెస్ట్ ఎంప్లాయిస్ నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో (మూడవ స్థానం)అవార్డు అందుకున్నారు. అర్.ఐ.ఎన్.ఎల్ విప్స్ ప్రతినిధులకు ప్రతిస్ఠాత్మక అవార్డు లభించడం పట్ల ఉక్కు సి.ఎం.డి. మధుసూదన్ అవార్డుగ్రహీతలకు అభినం దనలను తెలిపారు.

## సిమెంట్ రేకులతో ఊరట చెందాం

### టిఎస్సార్‌కు ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారులు



విశాఖపట్నం: రాజ్యసభ సభ్యులు టి.సుబ్బరామిరెడ్డి చొరవతో సీఎస్ఆర్ నిధులు వెచ్చించడం ద్వారా సిమెంట్ రేకులు పొందిన లబ్ధిదారులు సోమవారం టిఎస్సార్ క్యాంపు కార్యాలయానికి వచ్చి ఆయన ధన్య వాదాలు తెలిపారు. వివిధ వార్డుల నుండి పెద్ద సంఖ్యలో వచ్చిన లబ్ధిదారులు సిమెంట్ రేకులను ఇంటి పై కప్పులుగా వేసుకుని ఊరట చెందామని తెలిపారు. అంతకుముందు జరిగిన విలేకర్ల సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లా డుతూ మరో రూ.10కోట్ల సీఎస్ఆర్ నిధులతో నగరంలో 20వేల పూరిళ్లకు సిమెంట్ రేకులు అంద జేయ నున్నట్లు తెలిపారు. విశాఖను పూరిళ్ల రహిత నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఇప్పటి వరకూ 8వేల ఇళ్లకు 50వేల రేకులను అంద జేసినట్లు తెలిపారు. అలాగే సీఎస్ఆర్ నిధులతో గ్రామాలకు 20వేల ఎల్ఈడీ లైట్లను అంద జేసినట్లు తెలిపారు. పాఠశాలలకు 5వేల బెంచ్ లను అందజేసినట్లు టిఎస్సార్ వివరిం చారు. మరో రూ.20కోట్ల సిఎస్ఆర్ నిధులతో 500 గ్రామాలకు ఎల్ఈడీ లైట్లు, వందల స్కూళ్లకు బెంచ్‌లు అందజేయనున్నట్లు వివరించారు.

## నేడు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

సబ్బవరం: ఈనెల 13న సబ్బవరం శివారు గణపతిపురం మల్లికార్జునస్వామి తీర్థం సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీల్లో విజేతలకు వరసగా రూ.6వేలు, రూ.3,500, రూ.2,000 బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు 9966821817, 9989872107 నంబర్లలో సంప్రదించాలని కోరారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి పదిగంటల నుంచి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు.

**BEFORE THE HONORABLE COURT OF I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM.**
**I.A.263/17 IN O.S.626/2017**

**Between**
**Sri Mohammed Ali Rahamatulla ...Petitioner/ Plaintiff**
**And**
**Smt.Ganagala Konda ...Respondent/ Defendant**

**I.A.NOTICE**

**To**
**Respondent :**
**Smt.Ganagala Konda, W/o.Gargayya,**
**aged about 48 years, Hindu by religion,**
**Residing at D.No.22-1-30/1,**
**Chengalarao Ward, Visakhapatnam.**

Please take notice that the above I.A., stands posted to **28-02-2018,** for your appearance. If you have any objection you may attend either personally or through an advocate before the above said court by **10.30 A.M.,** failing which the matter will be decided exparte in your absence.

**Hearing dt : 28-02-2018**

(By order of the Court)
**Md.Habeebullah, Smt.V.(K).Usha Rani,**
**S.M.Zahurullah, B.Kumarswamy,**
**Y.Bhanusri Akhila, Md.Asfiya**
**Advocates**
**"Basith Villa" D.No.13-28-6,**
**K.G.H.Up Road, Maharanipeta,**
**Visakhapatnam-530002,**
**Ph:9849296658, 9441757493.**

Visakhapatnam
Dt: 11-02-2018

## గురుకుల కళాశాలకు బంకర్ బెడ్లు

కొయ్యూరు : కాకరపాడు గిరిజన సంక్షేమశాఖ గురుకుల జూనియర్ కళాశాలకు 80 బంకర్ బెడ్లు వచ్చాయి. ఇప్పటి వరకు 80 బెడ్లు అందుబాబులో ఉండగా తాజాగా అనకాపల్లి నుంచి 80 బెడ్లు వచ్చాయి. బెడ్స్ సమకూరడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

యలమంచిలి రూరల్ : శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. యలమంచిలిలోని కొత్తపేటలో ఉన్న చారిత్రాత్మక రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఇప్పటికే విద్యుత్ లైటింగ్‌తో అలంకరించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆలయాన్ని 150 ఏళ్ల క్రితం చాణుక్యులు నిర్మించినట్టు ఆలయ అర్చకుడు వంశీ తెలిపారు. అప్పటి నుంచి ఆలయంలో ఏటా ఆగమన శాస్త్రం ప్రకారం శివరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవం రోజు ఉదయం పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, రాత్రి 10 గంటల సమయంలో లింగోద్భవ కాలంలో 54 ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించనున్నారు. ఆలయానికి వేలాది మంది భక్తులు రానుండటంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కొమ్మాయిగుండం వద్ద పార్వతీపరమేశ్వరుల విగ్రహాల వద్ద, త్రిమూర్తులస్వామి, సోమ లింగపాలెం, వార్డులోని ఆలయాలను పూజలకు సిద్ధం చేస్తున్నారు.

## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

### ఆర్టీసి డిఎం సూర్యపవన్‌కుమార్

నర్సీపట్నం : శివరాత్రి సందర్భంగా నర్సీపట్నం ఆర్టీసి డిపో నుంచి కల్యాణపులోవ, దారమఠం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సిహెచ్.సూర్యపవన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 14 వరకు కల్యాణపులోవకు 60 బస్సులు, దారమఠానికి 12 బస్సులు తిప్పుతామని చెప్పారు. కొత్తకోట, దొండపూడి, కళ్యాణపులోవ ఆర్టీసి సమాచార కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తట్టబంద, కన్నూరిపాలెం, మాడుగుల ఘాట్ రోడ్డు, రావికమతం, కొత్తకోట, రోలుగుంట, కొంతలం, శరభవరం, కేడిపేట, కంఠారం తదితర ప్రాంతాల నుంచి అర్ధరాత్రి 12 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని ఆయన తెలియజేశారు.

## ఉమారామలింగేశ్వర ఆలయంలో మహిళలచే లక్ష కుంకుమార్చ పూజలు



సబ్బవరం : మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన గొర్లెవానిపాలెం గ్రామంలో సోమవారం శివరాత్రి పురస్కరించుకుని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వందమంది మహిళలచే లక్ష కుంకుమార్చన పూజలు ఘనంగా జరిగాయి. సోమవారం వేద పారాయణం, విశేష హోమ కార్యక్రమాలు, మహా శివుని సన్నిధిలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చంనాయుడు, ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో గొర్లి అచ్చంనాయుడు దంపతులు, ఎంపీపీ దంపతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### కొండ మీదకు రోడ్డు పూర్తి

రోలుగుంట : కొండపై ఉన్న దేవాలయాలకు వెళ్లటానికి ఎట్టకేలకు రహదారి సమస్య తీరింది. ఆ మార్గం పనులు తుది దశకు వచ్చాయి. స్థానిక కొండపైన సత్యనారాయణ, జగ్గారాయుడు, వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు సరైన మార్గం లేక భక్తులు ఎంతో కాలంగా అవస్థలు పడ్డారు. సర్పంచ్ పోతల లక్ష్మి రమణమ్మ ఎన్ఆర్ఇజిఎస్ మ్యాచింగ్ గ్రాంటుతో రోడ్డు కోసం ప్రతిపాదనలు చేసి అధికారులు ఆమోదం పొందారు.

DISTANCE EDUCATION
B.a., B.Com., B.Sc.,
M.A., M.Com., M.Sc.,
All Groups
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414,
99666 99633

DSC + TET
SGT - & S A Social
Group IV & Group
VRO - VRA
క్లాసులు ప్రారంభమయినవి
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414,
99666 99633

**BEFORE THE HONORABLE COURT OF I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM.**
**O.S.626/2017**

**Between**
**Sri Mohammed Ali Rahamatulla ...Plaintiff**
**And**
**Smt.Ganagala Konda ...Defendant**

**SUMMONS**

**To**
**Defendant:**
**Smt.Ganagala Konda, W/o.Gargayya,**
**aged about 48 years, Hindu by religion,**
**Residing at D.No.22-1-30/1,**
**Chengalarao Ward, Visakhapatnam.**

Please take notice that the above suit, which is filed against you, stands posted to **28-02-2018,** for your appearance. If you have any objection you may attend either personally or through an advocate before the above said court by **10.30 A.M.,** failing which the matter will be decided exparte in your absence.

**Hearing dt : 28-02-2018**

(By order of the Court)
**Md.Habeebullah, Smt.V.(K).Usha Rani,**
**S.M.Zahurullah, B.Kumarswamy,**
**Y.Bhanusri Akhila, Md.Asfiya**
**Advocates**
**"Basith Villa" D.No.13-28-6,**
**K.G.H.Up Road, Maharanipeta,**
**Visakhapatnam-530002,**
**Ph:9849296658, 9441757493.**

Visakhapatnam
Dt: 11-02-2018

## ప్రజాసమస్యల పరిష్కారానికై

# ప్రజల ముందుకు ప్రభుత్వ పాలన

### - మంత్రి మల్లాడి






యానాం: నియోజయవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికై వారంవారం ప్రజల ముందుకు ప్రభుత్వ పాలనను నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అన్నారు. సోమవారం ఉదయం సావిత్రినగర్, గిరియం పేటలో వివిధ శాఖాధికారుల సమక్షంలో ప్రజలముందు పాలన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత 1999 ప్రజల ముందుకు ప్రభుత్వ పాలన ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు తీసుకొచ్చే అనేక సమస్యలను ప్రభుత్వ అధికారుల సమక్షంలో పరిష్కరించడం జరిగిందన్నారు. ప్రజలకు ఉన్న సమస్యలు వివిధ శాఖలకు వచ్చి ఫిర్యాదుచేసినా పరిష్కారంకాని పరిస్థితులలో తక్షణ పరిష్కారానికి ప్రజలవద్ద చేయడం జరిగిందన్నారు. గృహ ఋణాలు, రేషన్‌కార్డులు, స్థలాల మంజూర్లు, చేపలవేటకు వెళ్ళి చనిపోయినవారికి ఆర్థిక సహాయం, వృద్ధాప్య పింఛన్లు, జిఎస్‌సిపి పరిహారం, డ్రైనేజి, రోడ్లు నిర్మాణాలు, అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. అదే మాదిరిగా అనేక సమస్యలను పరిష్కరించడంతోపాటు తీర ప్రాంతాల పురోభివృద్ధికి అనేక పథకాల అభివృద్ధి పనులను వివరించారు. 2010 ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి పనులు చేపట్టడం జరిగిందని నిధుల కొరతవలన పనులు నిలిచిపోయాన్నారు. ఈ విషయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళి నిధులు విడదుల చేయించి పనులు పూర్తిచేయిస్తామన్నారు. సావిత్రినగర్‌లో పిల్లలు ఆడుకునేందుకు రూ. 3 కోట్ల తో క్రీడామైదానం, అలాగే పార్కు పనులకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని మూడు నెలలో పనులు చేపడతామన్నారు. సావిత్రి నగర్‌లో ఇళ్ళ పట్టాలు లేనివారికి మంజూరుచేస్తామన్నారు. 1996లో రూ. 30 వేలు, రూ. 40 వేలు గృహ నిర్మాణ ఋణాలు తీసుకొని ఇల్లు కట్టుకున్నవారి ఇల్లు శిథిలమైపోయాయని ప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతులు తీసుకొచ్చి వారికి కొత్త ఋణాలు మంజూరుచేసేందుకు కృషిచేస్తామన్నారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునేవారికి ఋణాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 20 సంవత్సరాలు పైబడిన గృహనిర్మాణనికి రూ. 20 వేలు తీసుకున్నవారికి ఋణం ఇవ్వడానికి నిబంధనలు వర్తిస్తాయన్నారు. ఈ విషయంపై రూ. 40 వేలు, రూ. 50 వేలు గృహనిర్మిణ ఋణాలు పొందినవారికి కమిటీ వచ్చి పరిశీలించి నివేదిక ఇచ్చిన తరువాత కొత్త ఋణాలు పొందేదుకు ప్రభుత్వ అనుమతి తీసుకుంటామన్నారు. సావిత్రినగర్, గిరియంపేట, దరియాలతిప్ప, దుమ్మేటిపేట, పరంపేట, కురసంపేట వారికి ఇవ్వాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళతామన్నారు. వారంలో ఒక రోజు ఒక గ్రామంలో ప్రజల ముందుకు ప్రభుత్వ పాలన నిర్వహిస్తామన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం నుండి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు రివ్యూ నిర్వహిస్తామన్నారు. మత్స్య శాఖ ద్వారా వచ్చే నెలలో 191 మందికి కొత్తగా వృద్ధాప్య పింఛన్లు ఇవ్వనున్నామన్నారు. జిఎస్‌సిపి అగ్రిమెంట్ ప్రకారం చేపలవేట చేసే మత్స్యకారులకు పరిహారం ఇవ్వవలసిఉందని 5300 కుటుంబాలకు వారి బ్యాంకు అకౌంట్లుకు జమచేయడం జరుగుతుందన్నారు. మొత్తం రూ. 5 కోట్ల 70 లక్షల నిధులు 20 రోజులలో వారి అకౌంట్లలో జమఅవుతాయన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలతో మాట్లాడి వాటి పరిష్కారినికీ కృషిచేయడానికే ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాంకులకు వెళ్ళి నిధులు డ్రా చేసుకోలేని వికలాంగులు, వృద్ధులు ఇళ్ళ వద్దకు వెళ్ళి ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం పథకాలు పొందేందుకు ఆఫీసు చుట్టూ తిరగకుండా బ్రోకర్లవద్దకు వెళ్ళ కుండా ఉండేదుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా ప్రజలనుండి అనేక సమస్యలను అక్కడిక్కడ పరిష్కరిస్తు సమస్యల పరిష్కారానికి వారి యొక్క పేర్లను, ఫోన్ నెంబర్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ వి. గౌరిసరోజ, కె. రవిశంకరన, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు తదితరుల పాల్గొన్నారు.

## సత్యదేవున్ని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని ఆదివారము హైకోర్టు న్యాయమూర్తి ఎం.సీతారామ్మూర్తి కుటుంబ సభ్యులతో స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ మర్యాదలతో ఈవో ఎమ్.జితేంద్ర స్వాగతం పలికారు.

దర్శనానంతరము వేదపండితులు మహాదాశీర్వాదము అందించగా ఈవో వారిబి స్వామివారి ప్రసాదాన్ని జాపకము అందజేశారు.

## అన్నవరం విచ్చేసిన దేవస్థానం కమీషనర్ అనూరాధ



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని కుటుంబ సభ్యులతో దర్శించి, వ్రతమాచరించిన ఎండోమెంట్ కమీషనర్ వై.వి.అనూరాధ.ఆమెకు ఆలయ మర్యాదలతో ఈవో ఎమ్.జితేంద్ర, చైర్మెన్ ఐవి.రోహిత్, ఆలయ సూపరింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్, పిఆర్వో తులా.రాముడు, ఎఇవో వైయస్ఆర్ మూర్తి,తదితరులు ఘన స్వాగతం పలికారు.దర్శనానంతరం వేదపండితులు మహాదాశీర్వాదం అనంతరం ఈవో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.అనంతరం కమీషనర్ అనూరాధ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సత్యగిరిపై నిర్మించనున్న 138 గదుల సత్రానికి తొలిగిన అడ్డంకి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా సుమారు 40 కోట్ల రూపాయలతో త్వరలో దేవస్థానం లో అభివృద్ధి పనులకు శ్రీకారం.అదేవిధంగా పిఠాపురం శ్రీపాద వల్లభ సంస్థానంలో జరిగిన అవినీతిపై త్వరలో పూర్తి స్థాయిలో నివేదిక బాద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకొంటామన్నారు.అన్నవరం ఈవో ఎమ్.జితేంద్ర,స్థానిక కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం ఈవో చందక.దారబాబు ల మధ్య జరిగిన వివాదానికి సంభందించి ఆర్ జెసి విచారణ పరిశీలించిన తదనంతరం చర్యలు చేపడతామన్నారు.అన్నవరం ఈవో జితేంద్ర ను మా అనుమతితోనే శ్రీ పాద వల్లభ సంస్థానానికి డిప్యుటేషన్ పై పంపించామన్నారు.కావాలని వెళ్ళలేదు. దేవాదాయ శాఖ ఎవరి సొంత పెత్తనానికి పనిచేయదు.స్థాయిని బట్టి ఉద్యోగులు విధులు నిర్వహించలన్నారు.అలాగి కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ ద్వారా వచ్చే నిధుల ద్వారా వచ్చే మూడేళ్ళలో రాష్ట్రానికి మహార్దశ అన్నారు. మొదటిగా అమరావతి తరువాత స్దానాల్లో టూరిజం యాత్రికుల సౌకర్యార్థం శ్రీశైలం, అన్నవరం, సింహాచలం దేవాలయాలకు ప్రసాద్ పథకం ఉపయోగపడుతుందన్నారు.అన్నవరం దేవస్థానంకు 40కోట్ల రూపాయలతో ప్రసాద్ పథకంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

## ఈ నెల 25 నుంచి కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం : భీమిలి క్రిష్ణకాలనీ లో శ్రీ కల్యాణ వేంకటేశ్వరు స్వామి షష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 1 వరకు వైభవంగా నిర్వహించ నున్నామని దేవాలయం సంక్షేమ సంఘం అద్యక్షులు గాడు.అప్పలనాయుడు అన్నారు. ఈ ఉత్సవాల వాల్ పోస్టర్లను రాష్ట్ర మంత్రి వర్యులు గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రేలంగి.అప్పలనర్సయ్య,భీమిలి టి.డి.పి.పట్టణ అద్యక్షులు గంటా నూకరాజు, నూకాలమ్మ ఉత్సవ కమీటి అద్యక్షులు, వాసుపల్లి. కొండబాబు, కార్యదర్శి గిడుతూరి. శ్రీనివాసరావు, నాయుకులు మైలపల్లి లక్ష్మణరావు,పెంటపల్లి. యోగేశ్వరరావు, ముత్యాలరావు, జి.సన్యాసి రావు,కాసరపు.పెద్ద ఎల్లాజి, నాగరాజు తదితరులు పాలుగున్నారు.

## విద్యా కమిటీ సభ్యులకు శిక్షణ

యానాం : విద్యాశాఖ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యాకమిటీ సభ్యులకు సర్వశిక్షాభియానం ద్వారా ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం బి.ఆర్.సి. ట్రైనింగ్ హాలులో సర్వశిక్షాభియానం కోఆర్డినేటర్ కమిడి ప్రభాకర్, ఇందిరాగాంధీ ప్రభుత్వ బాలికల ప్రథమిక పాఠశాల హెచ్‌ఎం వి. సాయిజానకీ ప్రారంభించారు. అన్ని ప్రబుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యా కమిటీ అధ్యక్షులు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో విద్యా కమిటీల పాత్ర, బాధ్యతలు, సర్వశిక్షాభియానం స్కీమ్స్ నిధుల వినియోగం పై పర్యవేక్షణ, విద్యా హక్కు చట్టం 2009, పాఠశాలలో నిర్వహించవలసిన అకౌంట్లు గూర్చి స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ ప్రస్తుత విద్యా విధానం పరీక్షా విధానం, సోషల్‌ఆడిట్ మరియు డిజస్టర్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై టీచర్ కె. రామగొపాల్ శిక్షణ ఇవ్వడం జరిగింది.

## సత్యదేవునికి వెండి మకరతోరణం బహుకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారికి దేవస్థానం పాలక మండలి సభ్యుడు శ్రీ మట్టే.సత్యప్రసాద్ వెండి మకరతోరణాన్ని శ్రీ స్వామివారికి విరాళంగా అందజేశారు.సహస్రదీపాలంకరణ సేవలో ఆశీనులయ్యే స్వామి అమ్మవార్ల ఉగుటూయలకు 3కిలోల 800గ్రాములు బరువుగల వెండితో తయారుచేయుంచిన మకరతోరణాన్ని అందజేశారు.

## భీమిలి లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

భీమునిపట్నం : కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆద్వర్యం లో స్థానిక చిన్నబజార్, డచ్ రోడ్డు వద్ద నిర్వహించిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరంకు 300 మంది కి పరిక్షలు నిర్వహించన్నట్లు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ చంద్రమూర్తి చెప్పారు. కార్యక్రమంలో విశాఖ సెవెన్ హిల్స్ ఆసుపత్రి ప్రముఖ నేత్ర వైద్యులు డా.అజయ్ శంకర్ కర్, పేదలకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ వారు ఉచితంగా కంటి అద్దాలు మందులు పంపిణి చేశారు. సేవినహిల్స్ సిబ్బంది, పౌండేషన్ డైరెక్టరులు కె.ఎస్.ఎన్ మూర్తి.శ్రీనివాసరావు,బానోజిరావు, ప్రసాదరావు, తదితరులు పాలుగున్నారు.

## ప్రజాసమస్య సట్టించుకోని వైకాపా

### ప్రచారానికి పరిమితమౌతున్న నాయకులు - ఎం.పీ. తోట

పెద్దాపురం : రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిరంతరం పోరాటం చేస్తున్న తెలుగుదేశం పార్టీపై ప్రజలు చూపుతున్న అభిమానం నమ్మకం చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ వైఎస్ఆర్‌సిపి అనవసర రద్దాంతం చేస్తున్నదని కాకినాడ పార్లమెంట్ సభ్యులతో తోట నరసింహం అన్నారు. సోమవారం సాయంత్రం చైర్మన్ రాజా సూరిబాబు రాజు స్వగృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్ఎడి ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పార్లమెంట్ లో ఐదు రోజులు సమావేశాలను స్థంభింపచేసి పోరాటం చేసామని కాని వైఎస్ఆర్‌సిపి సభ్యులు నామమాత్రంగా ప్లాకార్డులు చూపి. మంత్రిపై ఫిర్యాదుచేయడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్ర సమస్యలు అతిత్వరలో పరిష్కారం అవుతాయని రాష్ట్ర అభివృద్ధికి తేదేపా కట్టుబడి ఉందని నరసింహం అన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ రాజాసూరిబాబురాజు, ఆర్ సత్యనారాయణ, తాళీబత్తుల సాయి, ఎం. వీర్రాజు, కె. రామారావు, టి. రాజు కొరుపూరి రాజు, ఆత్మ చైర్మన్ కలకపల్లి రాము, అధికసంఖ్యలో కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## చేనేతకు పూర్తి సహకారం అందిస్తా

### - ఎంపి తోట నరశింహం



పెద్దాపురం : దేశవ్యాప్తంగా చేనేతకు పూర్తి సహాయ సహకారాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్వందించిందని కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తోట నరశింహం అన్నారు. సోమవారం చైర్మన్ రాజాసూరిబాబు రాజు స్వగృహంల విలేకరులతో మాట్లాడుతూ కేంద్రమంత్రి శ్రీమతి స్మృతి ఇరానీ దేశవ్యాప్తంగా పూర్తి సహాయసహకారాలు అందించేవిధంగా చర్యలు తీసుకున్న నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా, పెద్దాపురం పట్టణంలో గల చేనేత కుటుంబాలకు సంబంధిత వివరాలు తెలియజేశారు. కార్మికులకు సబ్సిడీ పుస్తకాలు, శిక్షణ మొదలగునవి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరున పెద్దాపురం శ్రీముప్పన రామారావు చేనేత సహకార సంఘ భవనంలో అధికారుల సమావేశంలో నిర్ణయాలు తీసుకోబడునని తెలిపారు. జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని విజ్ఞప్తిచేసారు. ఈ విషయం మార్చి 5న జరగనున్న పార్లమెంట్ సమావేశంలో ప్రభుత్వానికి తెలియపరచగలనని తోట నరసింహం తెలిపారు. ఈ సమావేశంలో చైర్మన్ రాజా సూరిబాబారాజు, వైస్‌చైర్మన్ కె. రాజు, చేనేత పెద్దలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణ అభిమానికి ఆర్థికసాయం



విశాఖపట్నం : గత ఏడు నెలలుగా అనారోగ్యంతో మంచానపడ్డ 28వ వార్డు బంగారమ్మమెట్టకు చెందిన సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని దసపల్లా అప్పారావుకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ. 5 వేలు స్వంత నిధులు ఆర్థికి సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలెవరైనా అనారోగ్యంతో బాధపడితే ఆందోళన చెందవద్దని వెంటనే డయల్ యువర్ ఎమ్మెల్యే , ప్రజాదర్బార్ ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే వారికి సాయం అందచేస్తామని బరోసా ఇచ్చారు. పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బంటుపల్లి సూర్యనారాయణ, మత్స్యకార నాయకుడు మున్నం బాలాజీ తదితరులు హాజరయ్యారు.

## ఘనంగా యలమర్తి వారి సత్తెమ్మ తల్లి సంబరం



రావులపాలెం: మండల పరిధి వెదిరేశ్వరంలో శని, ఆదివా రాల్లో ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరాలు జరుపుకున్నారు. యలమర్తి వారి ఇలవేల్పు సత్తెమ్మతల్లి అని, తర తరాల నుండి యలమర్తి వంశీయులు సత్తెమ్మ తల్లిని పూజిస్తూ ఇలవేల్పుగా కొలుస్తూ అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని మండల ఆర్యవైశ్య అధ్యక్షులు యలమర్తి రామయ్య (రాంబాబు) తెలిపారు. యలమర్తి వారి ప్రతి ఇంట అమ్మవార్ని ఆనవాయితీగా పూజిస్తూ ప్రతి యలమర్తి కుటుంబంలో అమ్మవారి పేరు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శనివారం రాత్రి అమ్మవార్కి మేలుకొనుపుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారం అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపుతో సంబరాలు ముగిసాయన్నారు.

ఈ సంబరాల్లో యలమర్తి వారి కుటుంబీకులు, ఆడపడుచులు సుమారు 1500 మంది పాల్గొని అమ్మవార్ని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సిఐ బొక్కా పెద్దిరాజు, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, బొక్కా వెంకటలక్ష్మి, చిర్ల గోపిరెడ్డి, సయ్యపరాజు జనార్ధనరాజు, సయ్యపరాజు రామకృష్ణంరాజు, యలమర్తి బాలయ్య, మానేపల్లి వెంకటపతి, యలమర్తి కృష్ణమూర్తి, యలమర్తి సూరిబాబు, యలమర్తి శ్రీనివాసరావు, యలమర్తి సత్యానందం, మన్యం భాస్కరరావు, మోటమర్రి వీర వెంకట సత్యనారాయణమూర్తి, కంకటాల వెంకటరత్నం (నాని), కంకటాల పెద పుల్లయ్య, కంకటాల రాంబాబు, కుటుంబీకులు, వంశీకులు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్ని అమ్మవార్ని లు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

# ఏర్పాట్లు ఘనం - ఆచరణ శూన్యం

- రంగువేసేందుకు నోచుకోని ఆలయ ముఖద్వారం - తూతూ మంత్రంగా శివరాత్రి ఏర్పాట్లు



పిఠాపురం : దక్షిణ కాశీగా పేరుగాంచిన పిఠాపురం పాదగయా క్షేత్రం అధికారుల నిర్లక్ష్యంతో ఏర్పాట్లు నిరుగారాయి. ఆలయ ముఖద్వారం కనీసం రంగులు వేసేందుకు కూడా నోచుకోలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా హిందూసాంస్కృతి సాంప్రాదాయాలు నిలయంగా మారిన పిఠాపురంలో ఈ మధ్యకాలంలో అధికారుల అలసత్వంతో దేవాలయల ప్రతిష్ట మసకబారుతుంది. ప్రస్తుతం పాదగయ క్షేత్రంలో జరిగిన మహాశివరాత్రి ఏర్పాట్లు అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారాయి. భక్తులు పరమపవిత్రంగా భావించే ప్రధానాలయం పాదగయాక్షేత్రంలో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. అధిక ఆదాయం సమకూరుతున్నా బిల్లు చెల్లింపుల్లో చూపించే ఉత్సాహం పనులు చేయడంలో ఉండడవలేదని, ఆలయాలకు రంగులు వేయకుండా భక్తులు పరమ పవిత్రంగా భావించే పాదగయ పుష్కరిణి నీటితోనే అగ్నిమాపక సిబ్బంది మోటర్లుతో తోడి ఆలయాలను శుద్ధిచేయడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈఓ ఇటీవల శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టడంతో పాదగయాక్షేత్రంపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. మహాశివరాత్రి సంధర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లు తూతూ మంత్రంగా సాగించారు. ఉన్నతాధికారులు స్పందించి ఆలయ ప్రతిష్ట మసకబారకుండా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో భగవంతుని ఆగ్రహానికి గురికాక తప్పదని, భక్తుల మనోభావాలని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# వైఎస్ జగన్ కీలక సమావేశం



నెల్లూరు: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయం, ప్రత్యేక హోదా తదితర అంశాలపై చర్చించేందుకు తమ పార్టీ ముఖ్యనాయకులతో ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెద్దకొండూరులో వైఎస్ జగన్ పాదయాత్ర శిబిరం వద్ద ఈ సమావేశం జరుగుతోంది.

ఈ భేటీకి వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, ఎంపీలు ప్రాంతీయ సమన్వయకర్తలు హాజరయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ప్రత్యేక హోదా సాధన కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ సాగిస్తున్న నాటకాలను ప్రజలకు వివరించేందుకు ఏవిధంగా ముందుకు వెళ్లాలనేదానిపై కూడా చర్చిస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

చదవండి
చదివించండి
**విజయభాను**

# ప్రాజెక్టు పనులు సగం పూర్తయ్యాయి

**సీఎంకు వివరించిన అధికారులు**

**వచ్చేవారం పరిశీలిస్తాను: సీఎం బాబు**



అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు 51వ సారి వర్చ్యువల్ రివ్యూ నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి దేవినేని ఉమా, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు 53 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

కుడికాల్వ పనులు 91 శాతం, పోలవరం ఎడవ కాల్వ పనులు 61 శాతం, స్పిల్‌వే, స్పిల్‌ఛానల్, పీహెచ్ తవ్వకం పనులు 71 శాతం, స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనులు 14 శాతం, పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం 68 శాతం, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు 58 శాతం పూర్తయ్యాయని సీఎంకు అధికారులు వివరించారు.

కొత్త వర్క్ ఆర్డర్లను ఇవ్వాలని పోలవరం ప్రాజెక్టు అధికారి శ్రీధర్అన్నారు. కొన్ని డిజైన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెప్పారు. అంతేకాక నిర్దేశిత లక్ష్యాల మేరకు పనిచేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పురోగతి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. వచ్చేవారం పోలవరం పనులను పరిశీలిస్తానన్న సీఎం చంద్రబాబు చెప్పారు.

# విజయం సాధించుకున్న ఊబర్ కార్మికులు



ఊబర్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని 18రోజులుగా సమ్మె జరుగుతోంది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 6వ రోజు నిరాహారదీక్షలను ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు డి.అప్పలరాజు ప్రారంభించారు. విశాఖపట్నంలో ఊబర్ కంపెనీ పెట్టిన నుండి సుమారుగా 4వేల మంది ఆపరేటర్స్‌గా పనిచేస్తున్నారు. వీరితో గతంలో కరపత్రం ద్వారా 60వేల రూపాయలు ఆదాయం వచ్చే విధంగా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారు. అలాగే ప్రతీరోజు డీజిల్ ధరలు పెరగడంతో ఆపరేటర్స్ ఇబ్బందులు పడుతున్నారు. వారికి ఫైనాన్స్, డీజిల్, డ్రైవర్లకు జీతం సంపాధించాలంటే రోజుకి కనీసం 15గంటలు పనిచేయాల్సి వస్తుంది. మీరు ఇచ్చే రేట్లు సరిపడవు. అలాగే ముందుగా ఇచ్చిన రేట్లను ఇంకోసారి తగ్గించి ఇవ్వటం జరుగుతుంది. నేడు కనీసం మార్కెట్‌లో టాక్సీల కంటే తక్కువ ఆదాయం వస్తుంది. గతంలో యాజమాన్యానికి అనేక సార్లు రేట్లు పెంచమని అడిగారు. అడిగినవారిని బెదిరించడం, వారి అకౌంట్స్‌ని మూసేస్తున్నారు. ఈ రకంగా యాజమాన్యాం ప్రవర్తించడం వలన ఆపరేటర్లు అంతా బయట పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడింది. కొత్తగా రాబోతున్న ట్రాన్స్‌పోర్టు చట్టంలో ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్, కాంప్లేక్స్ వంటి స్టాండుల్లో, స్థలాలను ఊబర్, వోలా వంటి సంస్థలకు అప్పగిస్తున్నారు. వీరు డ్రైవర్లతో చేసుకున్న ఒప్పందం అమలు చేయకపోవడం కారణంగా ఫైనాన్స్ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఊబర్ యాజమాన్యంతో ఈ రోజు జరిగిన చర్చల వివరాలు. గతంలో చిన్న కారుకు 6రూ॥లు ఉన్న దాన్ని 8.60పైసలకు పెంచారు. పెద్దకారుకు గతంలో 7రూ॥లు ఉన్నదాన్ని 10.50 రూ॥లకు పెంచారు. బోనస్ పే 40రూ॥లు ఉన్నదాన్ని 45రూ॥లకు పెంచారు. బూస్ట్ పాతది 1×1 ఉన్నదాన్ని 1×3కి పెంచారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని, ఇవి కాకుండా మిగత డిమాండ్లను యాజమాన్యంతో చర్చలు జరిపి పరిష్కారం చేస్తామని ఊబర్ మేనేజర్ సందీప్‌రెడ్డి తెలియజేసారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్‌గారిని కలిసి చర్చలు బలప్రదం అవ్వడంతో ధన్యవాదాలు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమనికి విశాఖ మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ ప్రధానకార్యదర్శి జి.అప్పలరాజు, ఊబర్ కార్మికులు మురళి, మధు, పాత్రుడు, కోటి, ఎం.వెంకటేష్, గణపతి, చిన్న, ఎన్.వెంకటేష్‌రెడ్డి, మణి ప్రసాద్ పాల్గొన్నారు.


## మహాశివరాత్రి శుభాకాంక్షలు





# ఉపాసన న్యూ లుక్ మైండ్ బ్లోయింగ్.....



ఓ ఐదున్నర సంవత్సరాలు వెనక్కి వెళితే..... రామ్ చరణ్- ఉపాసన పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రకటించగానే సోషల్ మీడియాలో చాలా ట్రోలింగ్ జరిగింది. మేడ్ ఫర్ ఈచ్ అదర్ జోడీలా ఈ జంట లేదంటూ చాలా మంది కామెంట్లు చేశారు. ఆ సమయంలో ఉపాసన కాస్త లావుగా, బొద్దుగా ఉండటమే అందుకు కారణం. కట్ చేస్తే.... ఇపుడు ఉపాసన లుక్ పూర్తిగా మారిపోయింది. తనపై వచ్చిన ఈ విమర్శలను ఉపాసన చాలా సీరియస్‌గా తీసుకుందో? ఏమో? తెలియదు కానీ.... ఎవరైతే విమర్శలు చేశారో వారి నోరు మూయించడానికి చాలా కష్టపడ్డారు. హీరోయిన్‌కు ఏ మాత్రం తీసిపోకుండా స్లిమ్ లుక్‌తో అదరగొడుతున్నారు. ఇక ఎవ్వరూ ఆ కూతలు కూయలేరు ఉపాసన తాజా లుక్ చూసిన ఎవరైనా ఆమె గురించి ఇక ఎలాంటి కూతలు కూయలేరు. తనకు అందమైన రూపం మాత్రమే కాదు, అందమైన మనసు కూడా ఉంది అని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు ఈ కొణిదెల కోడలు పిల్ల. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ గొప్పమనసు చాటుకుంటున్నారు. మెగా అభిమానులు మెచ్చిన కోడలు ఉపాసన తన పుట్టింటి వారు నిర్వహిస్తున్న అపోలో ఆసుపత్రి డైరెక్టర్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఓ వైపు తన ప్రొఫెషన్లో ఆమె బిజీగా ఉంటూనే.... ఇటు అత్తింటి వారికి ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా మసులుకుంటూ రెండు బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతున్నారు. మెగా అభిమానులు మెచ్చిన కోడులుగా పేరు తెచ్చుకున్నారు.




ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సరస్వతీ పార్కు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట వరకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులు. ఈ కార్యక్రమంలో బి. శంకరరావు, కె. శ్రీనివాసరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సరైన నిద్ర ఉండేలా చూసుకోవాలి

విశాఖపట్నం: మీరెప్పుడైనా ఓ వ్యక్తి నేలపై పడిపోయి అతని శరీరం వణుకుతూ ఉన్నట్లయితేఅతను ఫిట్స్‌తో బాధపడుతున్నాడని అర్థం చేసుకోవాలి. ఆ వ్యక్తికేఇలాంటి సందరాలు మళ్లీ మళ్లీ జరుగుతుంటే వైద్యభాష పరంగా దీన్నిఎపిలెప్సీ అంటారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరోలజీ ఎపిలెప్సీని 2018 వరల్డ్బ్రెయిన్ డే ఉద్యమానికి ఇతివ ృత్తంగా ఎంపికచేసింది. ఈ ఎపిలెప్సీ చాలాపురాతనమైన వ్యాధి. 400వ శతాబ్దంలో చరక సంహితలో ఇది 'అపస్మార' గా పేర్కొనబడింది. ఇది మెదడుకు సంబంధించిన వ్యాధి ప్రతి వందమందిలోఒకరికి ఈ వ్యాధి ఉంటుంది. ఈ వ్యాధిబారిన పడిన ప్రముఖుల్లో జాంటీ రోడ్స్, అలెగ్జాండర్, సోక్రటీస్, చార్లెస్ డికెన్స్, జూలియస్ సీజర్, నెపోలియన్ బొనపర్టేతదితరులున్నారు.

ప్రముఖ న్యూరాలజిస్ట్, ప్రొఫెసర డాక్టర్ కె.సత్యారావు వెల్లడించిన వివరాలప్రకారం మెదడు కణాల నుంచి విడుదలయ్యే విద్యుత్ ప్రభావంగానే ఈ వ్యాధిసంకేతాలు ఆధారపడతాయి. 'మెదడు రెండువైపులా విద్యుత్ విడుదలప్రభావం చూపినట్లయితే రోగి అకస్మాత్తుగా పడిపోవటం లేదా, అపస్మారకస్థితికి చేరుకోవటం జరుగుతుంది. అప్పుడు రోగి శరీర అవయవాలన్నీబిగుసుకుపోవటం లేదా విపరీతంగా కొట్టుకోవటం జరుగుతుంది. నాలుకకరుచుకోవటం, గాయాలు కావటం, మూత్రం పోసుకోవటం, వాంతి చేసుకోవటంకూడా మనం గమనించవచ్చు' అని డాక్టర్ కె.సత్యారావు పేర్కొన్నారు, దీనినేజనరల్ సెక్షన్ అంటారు. ఒకవైపు మాత్రమే విద్యుత్ విడుదల ప్రభావంఉన్నట్లయితే రోగి చేతనావస్థలోనే ఉంటారు, కాకుండా అచేతనలో కూడాఉండవచ్చు.

# ఆర్కే బీచ్‌లో టీఎస్సార్ కోటిలింగాల ప్రతిష్ఠ

## పలువురు ప్రముఖుల హాజరు భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు పూర్తి

## సీనియర్ సినీ నటుడు కైకాల సత్యనారాయణకు విశ్వసామ్రాట్ బిరుదు ప్రదానం

## ప్రత్యేక పూజలలో పాల్గొననున్న మోహన్‌బాబు, బాలకృష్ణ, మంత్రి గంటా, ప్రముఖులు

విశాఖ సిటీః మహా శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మహాశివరాత్రి పర్వదినము రోజు విశాఖ సాగర తీరంలో టీఎస్ఆర్ సేవాపీఠం ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు టి. సుబ్బరామి రెడ్డి కోటి లింగాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామి ఆశీస్సులు, పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ మహా శివరాత్రి పూజా పునస్కారాలలో కోటి లింగాల అర్చనలో రాష్ట్రానికి చెందిన పలువురు గురువులు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరు కానున్నట్లు టీఎస్ఆర్ సేవాపీఠం సభ్యులు తెలియజేశారు. అనంతరం సీనియర్ సినీ నటుడు, విభిన్న పాత్రధారి డాక్టర్ కైకాల సత్యనారాయణకు విశ్వ నట సామ్రాట్ బిరుదు ప్రదానం చేయనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



మహా శివరాత్రి సందర్భంగా స్థానిక ఆర్‌కె బీచ్‌లో ఏర్పాటు చేస్తున్న మహా శివ లింగ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ టి. సుబ్బరామి రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి తదితరులు

## ఏవోబీలో కొనసాగుతోన్న

# ఎదురుకాల్పులు



ఒడిశా: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. జొడాంబో గ్రామ పంచాయతీ పరిధిలోని జగన్నాథపురంలో ఈ ఉదయం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ కాల్పుల నేపథ్యంలో మావోయిస్టులు అక్కడి నుంచి పరారైనట్టు సమాచారం. ఘటనా స్థలంలో సుమారు 60 కిట్ బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రస్తుతం గేదెలపాడు టిక్కరిపడలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్టు విశాఖ ఎస్పీ వెల్లడించారు. రాష్ట్రంలో పెద్దగా మావోయిస్టుల కదలికలు లేవని గతేడాది పోలీసులు అంచనా వేశారు. 2016లో భారీ ఎన్‌కౌంటర్ తర్వాత పెద్దగా మావోయిస్టు కార్యకాలపాలు జరగలేదు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు తమ ప్రాబల్యాన్ని చాటుకొనేందుకు చిన్నచిన్న ఘటనలకు పాల్పడ్డారు. ప్రస్తుతం ఉదయం నుంచి ఎదురు కాల్పులు జరుగుతండటంతో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఉన్నారా అనే అనుమానం నెలకొంది.

# 'సింధు.. సారీ'

### మా దృష్టంతా జపాన్ క్రీడాకారులపైనే



ముంబై: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు తన అధికారిక స్పాన్సర్ యోనెక్స్ క్షమాపణలు తెలియజేసింది. తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురికావడం వల్లే భారత్‌ను కించపరిచేలా సందేశం వచ్చిందని యోనెక్స్ వివరణ ఇచ్చింది. ఈ క్రమంలోనే సింధును క్షమించమంటూ విన్నవించింది.

'గుడ్ బై సింధు. భారత్‌లాంటి పేద దేశానికి చెందిన ఆటగాళ్లు ఇక మా స్పాన్సర్‌షిప్ పొందబోరు. ఇక మా దృష్టంతా జపాన్ యువ క్రీడాకారులపైనే' అని యోనెక్స్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి సింధుకు మెసేజ్ వచ్చింది. అసలు ఏమి జరిగిందో తెలుసుకునేలోపే మరొక మెసేజ్ యోనెక్స్ నుంచి సింధుకు రావడంతో ఆమె ఊరట చెందింది. 'మా ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ (యోనెక్స్ డాట్ కామ్)నుంచి మాకు తెలియకుండా పోస్ట్ అయిన ఆ అసంబద్ధ మెసేజ్ కారణంగా యోనెక్స్ అభిమానులందరికీ నిజాయితీగా క్షమాపణలు తెలియజేస్తున్నాం. మా అకౌంట్ హ్యాక్ అయింది.

అంతలోనే సమస్య పరిష్కారం అయింది. మా అకౌంట్ మరింత భద్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. భవిష్యత్‌లో ఇలా జరగదు' అని యోనెక్స్ స్పష్టం చేసింది.

# మార్చి నెల 3వ వారంలో ఏజెన్సీలో మెగా వైద్యశిబిరం

### జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్

విశాఖపట్నంః మార్చి నెలలో ఏజెన్సీలో నిర్వహించనున్న మెగా వైద్య శిబిరానికి (స్పెషలిస్ట్) అవసరమగు ఏర్పాట్లు గావించాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలక్టర్, బాలసుబ్రహ్మణ్యం (రిటైర్డ్ ఐఎఎస్), జనరల్ సెక్రటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కలిసి ఈ విషయమై వైద్యాధికారులు, పలువురు జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలక్టర్ ఏజెన్సీలో ఈ మెగా వైద్య శిబిరం నిర్వహణ నిమిత్తం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్లు, డిఆర్‌డిఎ ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డిసిహెచ్‌ఎస్ అదనపు జిల్లా కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమయి వైద్య శిబిరము నిర్వహణ ఏర్పాట్లు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ పాల్గొననున్న ఈ వైద్య శిబిరము నిర్వహణకు అవసరమైన వెన్యూ, తేదీ, వైద్య శిబిరానికి రావలసిన స్పెషలిస్టు వైద్యుల వివరాలు, ఖరారు గావించాలన్నారు. జిల్లాలోని వివిధ కార్పొరేట్ సంస్థలైన హెచ్‌పిసిఎల్, ఎన్‌టిపిసి, స్టీల్ ప్లాంట్ మొదలైన సంస్థల నుండి సిఎస్‌ఆర్ కింద సహకారము పొందాలన్నారు. కెజిహెచ్, టిబి హాస్పిటల్, అపోలో హాస్పిటల్, అపోలో హాస్పిటల్స్ నుండి



స్పెషలిస్ట్ వైద్యులు మెగా వైద్య శిబిరంలో సేవలందిస్తారన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ రమేష్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యసాయి శ్రీనివాస్, డాక్టర్ వేణుగోపాల్, పలువురు వైద్యాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రయోజనాల కోసమే


# పార్టీలకతీతంగా పనిచేస్తాం

### సీపీఐ రామకృష్ణ



హైదరాబాద్: ఏపీ హక్కుల సాధన కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా అందరితో కలిసి పనిచేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. జేఏసీ, జేఏఫ్‌సీ ఏర్పాటుపై సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ సమావేశంలో అందరి అభిప్రాయాలు సేకరిస్తామని అన్నారు. విభజన హామీలు ఏమున్నాయో... అందులో కేంద్ర ప్రభుత్వం ఎంతవరకు అమలు చేసింది... ఇంకా చేయాల్సినవి ఏమున్నాయన్నదానిపై సమగ్రమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జేపీ, ఉండవల్లి... పవన్‌తో కలిసి ఇదే ఆలోచనతో ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమని రామకృష్ణ అన్నారు.

# మాల్యాకు మరో షాక్!



లండన్/సింగపూర్ : బ్యాంకులకు రూ . వేల కోట్ల రుణాల ఎగవేత కేసులో నిందితుడైన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు మరో ఎదురు దెబ్బ తగిలింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ విమానాలను అద్దెకు తీసుకున్న బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు చెల్లించాలని బ్రిటన్ హైకోర్టు తేల్చిచెప్పడంతో మాల్యాకు న్యాయపోరాటంలో భంగపాటు తప్పలేదు. లీజింగ్ అగ్రిమెంట్ ప్రకారం కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సింగపూర్‌కు చెందిన బీఓసీ ఏవియేషన్ మూడు విమానాలను సరఫరా చేసింది.

కాగా, లండన్ కోర్టు వెలువరించిన తీర్పును బీఓసీ ఏవియేషన్ స్వాగతించింది. మరోవైపు రుణ ఎగవేతకేసులో నిందితుడైన విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించే కేసుపై లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

# మార్కెట్లకు లాభాలొచ్చాయ్..

ముంబయి: అల్లకల్లోలం.. ఊగిసలాట.. ఇలా గత కొన్ని రోజులుగా తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటూ భారీగా పతనమైన దేశీయ మార్కెట్లు నేడు కోలుకున్నాయి. మదుపర్ల కొనుగోళ్ల అండతో ఈ వారాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన సూచీలు లాభాలను సొంతం చేసుకున్నాయి. సెన్సెక్స్ దాదాపు 300 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 10,500 పైన స్థిరపడింది.

అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో ఈ ఉదయం సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్‌ను ఆరంభించింది. అయితే ఆ తర్వాత కాసేపు ఒడుదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ.. రోజంతా లాభాల్లోనే పయనించింది. చివరి గంటల్లో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో 295 పాయింట్లు ఎగబాకిన సూచీ 34,300 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 85 పాయింట్లు లాభపడి 10,540 వద్ద ముగిసింది.

టాటాస్టీల్, అరబిందో ఫార్మా, యూపీఎల్ లిమిటెడ్, యస్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లాభపడగా.. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ పెట్రోలియం, భారత ఇన్‌ఫ్రాటెల్, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి.









**VIJAYABHANU - Visakhapatnam**

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com